ప్రజాశక్తి

మంగళవారం 6 ఆగస్టు 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

# అన్ని జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పున కేటాయింపు

## ● కృష్ణా కలెక్టర్ చొరవతో సిఎం నిర్ణయం

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** జిల్లాలో తక్షణ అవసరాల నిమిత్తం రూ.5 కోట్లు కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు వెల్లడించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్లో ఏమైనా సందేహాలు సమస్యలు టే చెప్పాలని ముఖ్యమంత్రి కోరిన మీదట కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో పర్యటించినప్పుడు ఉపరితల జలాశయాలు (ఓహెచ్ఎస్ఆర్) శుభ్రం చేసేందుకు వీలుగా నిచ్చెనల అవసరం ఉందని, అయితే కొన్ని ట్యాంకులకు నిచ్చెన్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. సిఎం వెంటనే స్పందిస్తూ అన్ని జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పున తక్షణ అవసరాలకు ఖర్చు చేసేందుకు కేటాయిస్తామని ప్రకటించారు. అనంతరం కలెక్టర్ మరికొన్ని అంశాలను ప్రస్తావిస్తూ జిల్లా స్థాయి అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని కోరారు. వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందిస్తే భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు లేరని, కేవలం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉండడంతో రూ.40 లక్షలకు మించి ఏమైనా పనులు చేపట్టాలంటే ఇబ్బంది ఎదురవుతోందన్నారు. ఈపరిస్థితిని అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సిఎం స్పందించి ఈ విషయమై ఇబ్బంది లేకుండా అవసరమైతే అధికారాలను బదిలీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని శాఖాధిపతులకు సూచించారు. హైకోర్టు ధిక్కరణ కేసులను వాదించేందుకు ప్రభుత్వం తరపున న్యాయవాదులను ఏర్పాటు చేయాలని, అలాగే జిల్లాకు ఒక న్యాయవాదిని ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ కోరడంతో అందుకు సిఎం సమ్మతించారు. జిల్లాలో 70 నుంచి 80 శాతం పనులు పూర్తయి మిగిలిన 20 నుంచి 30 శాతం నిధులు లేక కొన్ని ప్రాజెక్టులు అలాగే ఉండిపోయాయని, ముఖ్యంగా మచిలీపట్నం నగరంలో రూ.34 కోట్లు ఖర్చు చేసి మురికి కాల్వలు నిర్మించారని, అయితే వాటి అవుట్‌ఫాల్ సరిగా లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయిందని, అటువంటి వాటికి నిధులు కేటాయిస్తే ఆ పనులు పూర్తయి సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. దీంతో సిఎం స్పందిస్తూ కష్ణా జిల్లానే కాకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు అటువంటివి గుర్తించి అంచనా వేసి ప్రతిపాదనలు ఏమైనా ఉంటే పంపాలని, వాటన్నిటిని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.



సిఎం చంద్రబాబు నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు డాక్టర్ జి.సృజన, డికె.బాలాజీ





విజయవాడలో జరిగిన ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, ఎన్‌సిహెచ్.సుప్రజ; మచిలీపట్నంలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు

# స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలి

## విజయవాడ, మచిలీపట్నం ధర్నాల్లో నేతల డిమాండ్

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు నిలుపుదల చేసి, బలవంతంగా తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ, కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ధర్నా చౌక్‌ల వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నాలు నిర్వహించారు. ఈ ధర్నాల్లో ఐకెపి విఒఎలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పాఠశాలల పారిశుధ్య కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. చిరుద్యోగులపై వేధింపులు, తొలగింపులు ఆపాలని, వివిధ శాఖల్లో తొలగించిన, బలవంతంగా రాజీనామా చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు నినదించారు. విజయవాడలో జరిగిన ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తొలగించిన, బలవంతంగా రాజీనామా చేయించిన వారిని విధుల్లో తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)

# ఇంజక్షన్ వికటించి ఐదుగురికి అస్వస్థత

## తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో ఘటన

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో ఇంజక్షన్ వికటించి ఐదుగురు రోగులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన చలిజ్వరం రావడంతోపాటు వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు భయాందోళన చెందారు. బాధితుల కథనం ప్రకారం... వొళ్లు నొప్పులు, జ్వరంతో ఆస్పత్రిలో చేరిన రోగుల్లో ఐదుగురికి డాక్టర్ సూచన మేరకు సిబ్బంది రంటాక్ ఇంజక్షన్ చేశారు. అయితే ఇంజక్షన్ వికటించి వారు తీవ్రమైన చలి జ్వరం వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే వైద్య సిబ్బంది అప్రమత్తమై విరుగుడు ఇంజక్షన్ చేశారు. కొద్దిసేపటికి ముగ్గురు అస్వస్థత నుండి కోలుకోగా, తిరువూరుకు చెందిన మోల్దుల్ అలీ మొయిన్ (12), ఖమ్మం జిల్లా ఎర్రగుంట ప్రాంతానికి షేక్ నాగుల్ మీరా (32) పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కడుపు పూత నివారణకు, గ్యాస్ సమస్యకు ఉపయోగించే రంటాన్ ఇంజక్షన్ ఇవ్వడం వల్లే బాధితులు అస్వస్థతకు గురయ్యారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.



ఇంజక్షన్ వికటించి అస్వస్థతకు గురైన బాలుడు

# సాగునీటి సమస్యను పరిష్కరించండి

## 'మీ కోసం'లో ఎపి కౌలు రైతు, రైతు సంఘాల నేతల వినతి

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి :** కాల్వల శివారు ప్రాంతాలకు సాగునీరు అందక వరి నారుమళ్లు, నాట్లు వేసిన పొలాలు ఎండిపోతున్నాయని, తక్షణమే సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ఎపి రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార (మిగతా 2లో)



ఇన్చార్జి డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న ఎం.హరిబాబు, జి.నాగేశ్వరరావు, పి.రంగారావు తదితరులు

# ఎస్‌సిల సామాజికాభివృద్ధికి బడ్జెట్ నిధులు పెంచాలి

## విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్‌కు కెవిపిఎస్ విజ్ఞప్తి

**ప్రజాశక్తి - విజయవాడ :** షెడ్యూల్డ్ కులాలను సామాజిక అభివద్ధిలోకి తీసుకురావడానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులను పెంచాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, దేశంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చెయ్యాలని కోరుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యాన సోమవారం విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)కి వినతిపత్రం సమర్పించారు. నగరంలోని ఎంపి కార్యాలయంలో ఆయనను కెవిపిఎస్ రాష్ట్ర (మిగతా 2లో)



ఎంపికి వినతిపత్రం సమర్పిస్తున్న అండ్ర మాల్యాద్రి, జి.నటరాజు, జి.క్రాంతికుమార్ తదితరులు

# ఇక్కడ పోస్టింగ్‌లు చాలా ఖరీదు గురూ!

## స్థానిక ఎంఎల్‌ఎ ప్రమేయంలేకుండానే వ్యవహారాలు

**ప్రజాశక్తి - గన్నవరం :** గన్నవరంలో పోస్టు చాలా కాస్ట్లీ గురూ..సొమ్ము కొడితేనే పోస్టు పడుతుంది.. ఇదీ కొంత మంది ఉద్యోగ సంఘ నేతల నుండి వినిపిస్తున్న మాట. రాజకీయ పెద్దలను ప్రసన్నం చేసుకొని అయ్యవారికి సొమ్ము కొడితే గన్నవరంలో పోస్ట్ వచ్చేసినట్టే.. కొంతమంది అధికారులను నోటి నుంచి వస్తున్న మాట. వివరాల్లోకి వెళితే..కొత్త ప్రభుత్వం ఏర్పాటు అనంతరం గన్నవరం నియోజకవర్గంలో పలు శాఖల్లో బదిలీలు జరుగుతున్నాయి. గత అయిదేళ్లుగా వైకాపా ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న అధికారులంతా వారికి అనుకూలురు, వీర విధేయులు కావడంతో తప్పనిసరిగా వారికి స్థానచలనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆయా శాఖల్లో కొన్ని బదిలీలు జరగా, మిగతా వాటికి జాబితాలు రూపొందాయి. మండల పరిషత్ లో ఎంపీడీవోలను మార్చాలని రాజకీయ నాయకులు భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు మూడు ప్రధాన ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి ఇక్క డకు వచ్చిన వారిని నేటికీ రిలీవ్ చేయకుండా తాత్సారం చేస్తున్నారు. మూడు మండలాల్లోనూ వైకాపా ఎంపీపీలే ఉండడం, ఎన్నికల ముందు వరకు ఉన్న ఎంపీడీవోలు మాజీ ఎమ్మెల్యే వంశీ, ఆయన అనుచరుల మాటే వేదవాక్కుగా భావించి పనిచేశారనే వాదన ఉంది. ఈ నేపథ్యంలో వీరిలో ఒక్కరికి కూడా తిరిగి ఇక్కడకు వచ్చేందుకు అవకాశం కల్పించకూడదని, మూడు మండలాల్లోనూ కొత్తవారినే నియమించాలని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఈ కారణంగానే బదిలీల ప్రక్రియలో జాప్యం నెలకొందన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రాజకీయ పెద్దలు కొంతమందికి లెటర్లు ఇచ్చారని అంటున్నారు. గన్నవరం వచ్చేందుకు కొంతమంది పైరవీలు చేస్తున్న పరిస్థితి ఉంది. సొమ్ము కొట్టి మరీ పోస్ట్ తెచ్చుకుందామని ప్రయత్నిస్తున్న వారు ఉన్నారని అంటున్నారు.

### తహసీల్దార్ల పోస్టు మరింత ఖరీదు ?

ఎన్నికల నేపథ్యంలో మూడు ప్రధాన మండలాల తహసీల్దార్లను గోదావరి జిల్లాలకు బదిలీ చేశారు. ఇటీవలే వారిని అక్కడ్నుంచి రిలీవ్ చేసి, పోస్టింగులు ఇచ్చారు. ముఖ్యంగా గన్నవరం తహసీల్దార్ ఎవరు వస్తారనేది తీవ్ర ఆసక్తి రేపింది. ఈ స్థానం కోసం గతంలో పనిచేసిన అధికారి, ఎన్నికల విధుల నిమిత్తం వచ్చిన తహసీల్దార్ పోటీ పడ్డారు. చివరకు ఎన్నికల విధుల కోసం వచ్చిన పవన్ కుమార్‌కు అవకాశం కల్పించారు. ఇక్కడ పోస్ట్ కోసం ఉన్నత స్థాయిలో లాబీయింగ్ జరిగిందని రెవెన్యూ ఉద్యోగుల్లో వినిపిస్తుంది. ఓ మంత్రి సహకారంతో ఇక్కడి ప్రజాప్రతినిధికి సంబంధం లేకుండా పోస్ట్ పడిందనే వాదన వినిపిస్తుంది. ఇక ఉంగుటూరు తహసీల్దార్ ఎవరనేది ఖరారుకాలేదు. బాపులపాడు స్థానం కోసం ఇద్దరు తీవ్రంగా పయత్నించినా, అనూహ్యంగా గతంలో పెదపారపూడి తహసీల్దార్‌గా వ్యవహరించి, ఎన్నికల విధుల నిమిత్తం నిడదవోలు వెళ్లి వచ్చిన నాగభూషణంకు అవకాశం దక్కింది.

### పోలీసు బదిలీలు?

పోలీసు శాఖకు సంబంధించిన బదిలీలు (మిగతా 2లో)



# రూ.150 కోట్ల ఉపాధి పనుల బకాయిలు చెల్లించాలి

### డిఆర్‌ఒకు వ్యకాసం జిల్లా కార్యదర్శి కోటా కళ్యాణ్ వినతి

**ప్రజాశక్తి-విజయవాడ :** పేరుకుపోయి ఉపాధి హామీ కార్మికుల బకాయిలు వెంటనే మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోటా కళ్యాణ్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.శ్రీనివాసరావుకు బాధిత కార్మికులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటా కళ్యాణ్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కార్మికులకు చెల్లించాల్సిన సుమారుగా రూ. 150.67 కోట్ల బకాయి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పలుసార్లు నిరసనలు, ఆందోళనలు, వినతిపత్రాలు అందజేసినా ప్రయోజనం ఉండటం లేదన్నారు. మే 13 తర్వాత ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం కూలీల ఎకౌంట్లో వేయలేదన్నారు. వ్యవసాయ పనులు కూడా అరకొరుగానే ఉన్నాయని తెలిపారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా మరో వంద రోజులు పనులు కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పైన రాజకీయ వేధింపులను నిలుపుదల చేసి, ఉపాధి హామీ పరిరక్షణకు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్లు దొప్పల వాణి, జ్యోతి, హేమలా నాయక్, కె.శ్రీనివాస్, టి.దుర్గారావు, కష్ణారావు పాల్గొన్నారు.

## విఎంసికి 36 ఫిర్యాదులు

**ప్రజాశక్తి - విజయవాడ :** నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కమాన్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 36 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. విఎంసి అడిషనల్ కమిషనర్ (జనరల్) డాక్టర్ ఏ.మహేష్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందిన ఫిర్యాదుల్లో ప్రణాళిక విభాగానికి సంబంధించి 15, ఇంజినీరింగ్ 8, ఎస్టాబ్లిష్మెంట్ 3, రెవెన్యూ, జెడి అమత్, విఏయస్, ప్రజారోగ్యం 2, యుసిడి 1, హార్టికల్చర్ 1 చొప్పున ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కే.వీ.సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నవళి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్ రావు, చీఫ్ సిటీప్లానర్ జీ.వి.జీ.ఎస్.వి ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ, డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# యుజిడి సమస్యను పరిష్కరించాలి

### పశ్చిమ సమస్యలపై ఎసిజికి సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు వినతి

**ప్రజాశక్తి-విజయవాడ :** పశ్చిమ నియోజకవర్గం పరిధిలో పేరుకుపోయిన పలుసమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు ఆయన నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ -(జనరల్) (ఎసిజి) డాక్టర్ ఎ మహేష్‌కు గ్రీవన్స్‌లో పలు సమస్యలపై అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ 50వ డివిజన్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారం కాక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే డివిజన్లో కార్పొరేటర్ బడ్జెట్ ద్వారా జండా చెట్టు వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని కోరారు. పశ్చిమ నగరంలో కలగానే మిగిలిపోయిన మినీ స్టేడియంలో నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. నెలల తరబడి మున్సిపల్ కార్మికులకు హెల్త్ ఎలివేన్స్ బకాయిలు విడుదల కావడం లేదన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఆప్కాస్ కార్మికులకు యూనిఫామ్, సబ్బులు ,చెప్పులు, గ్లౌజ్‌లు, నూనెలు తదితర వాటిని వెంటనే ఇప్పించాలని కోరారు. నగరంలో



జనన- మరణాల డీఎస్‌ఓను నియమించాలని కోరారు. ఎసిజిని కలిసిన వారిలో సిపిఎం 50వ డివిజన్ నాయకులు కె లక్ష్మణరావు, ఎస్‌కే బాజీ, యు రాము తదితరులు ఉన్నారు.

## గాంధీజీ కళాశాలలో కామర్స్ డే సెలబ్రేషన్స్

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** గాంధీజీ మహిళా కళాశాలలో సోమవారం కామర్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పిఎస్‌సిఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డాక్టర్ వి.విజయ దుర్గా ప్రసాద్ హాజరై వ్యాపార, వృత్తిపరమైన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన వాణిజ్య మాధ్యమాలు, వినూత్న వ్యాపార ఆలోచనలు, కామర్స్ ఎక్స్‌పో అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభను కనబరచిన విద్యార్థులకు జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ మహిళా కళాశాల వైస్ చైర్మన్ కె.వి.పిచ్చయ్య, ప్రిన్సిపాల్ ఎం.రమణశ్రీ, కామర్స్ హెచ్‌ఒడి ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు వి.వేణుగోపాల్, ఎ.శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.





ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డిసిపి కృష్ణమూర్తి

## సిపి కార్యాలయానికి 69 ఫిర్యాదులు

**ప్రజాశక్తి - విజయవాడ :** నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో 69 ఫిర్యాదులు అందాయి. డిసిపి (అడ్మిన్) ఎం.కృష్ణమూర్తి నాయుడు ఫిర్యాదులను స్వీకరించి బాధితులతో మాట్లాడారు. దివ్యాంగులు, వద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలతో మాట్లాడి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలవి 18, భార్యాభర్తలు, కుటుంబ కలహాలవి 15, భూవివాదాలవి 3, వేధింపులవి 4, వివిధ మోసాలవి 17, ఇతర చిన్న చిన్న వివాదాలు, సంఘటనలవి 12 ఉన్నాయి.

## అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపండి : డిఆర్‌ఒ వి.శ్రీనివాసరావు

**ప్రజాశక్తి - విజయవాడ :** ప్రజల నుండి స్వీకరించిన అర్జీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినప్పుడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లక్ష్యం నెరవేరుతుందని, జిల్లా అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దష్టి పెట్టాలని జిల్లా రెవిన్యూ అధికారి వల్లభనేని శ్రీనివాసరావు అన్నారు. కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా డీఆర్‌వో వి.శ్రీనివాసరావు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈకార్యక్రమంలో మొత్తం 140 అర్జీలు అందగా.. వీటిలో రెవెన్యూ-47, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివద్ధి-20, పంచాయతీరాజ్-20, పోలీస్-14, ఏపీసీపీడీసీఎల్-3, డీఆర్‌డీఏ-3, డ్వామా-3, వైద్యఆరోగ్యం-3, సర్వే సెట్టిల్మెంట్-3, సహకార శాఖ-2, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం-2, విద్య-2, గహ నిర్మాణం -2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్-2, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల-1, బీసీ వెల్ఫేర్-1, సివిల్ సప్లై-1, కాలేజ్ ఎడ్యుకేషన్-1, ఉపాధికల్పన -1, దేవాదాయ-1, గ్రామ వార్డు సచివాయలు-1, ఐసీడీఎస్ -1, ఇరిగేషన్-1, రహదారులు-భవనాలు-1, గ్రామీణ నీటి సరఫరా -1, సోషల్ వెల్ఫేర్ -1, ఖజానా శాఖ -1, గిరిజన సంక్షేమం -1 మొత్తం 140 అర్జీలు స్వీకరించగా, వాటిలో 79 అర్జీలను స్వయంగాను, 61 ఆన్లైన్ ద్వారా స్వీకరించినట్లు డిఆర్వో శ్రీనివాసరావు తెలిపారు.







## మొదటిపేజీ తరువాయి

### ఇక్కడ పోస్టింగ్‌లు చాలా ఖరీదు గురూ!

కూడా దాదాపుగా కొలిక్కి వచ్చేశాయి. గన్నవరం డీఎస్పీ జయసూర్య ఇప్పటికే బదిలీ అయ్యారు. హనుమాన్ జంక్షన్, గన్నవరం సీఐలను, పలువురు ఎస్సైలను ఇప్పటికే మార్చేందుకు వీలుగా జాబితాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. డీఎస్పీ పోస్టు కోసం ప్రధానంగా ఇద్దరు పోటీ పడుతున్నారని తెలిసింది. గన్నవరం, హనుమాన్జంక్షన్ సీఐలను మార్చేందుకు రంగం సిద్ధం చేశారని తెలిసింది. ముగ్గురు పైరవీలు చేస్తున్నారని తెలిసింది. ఇక్కడ పనిచేసే వెళ్లినవారు అందులో ఉన్నారని సమాచారం. గన్నవరంలో ఎస్ఐల విషయానికొస్తే.. గతంలో ఇక్కడ పనిచేసే వెళ్లిన శ్రీనివాస్‌ను మళ్లీ ఇక్కడికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. అందుకు వీలుగా ఓ ప్రజా ప్రతినిధి లెటర్ కూడా ఇచ్చారని సమాచారం. ఉన్నత స్థాయిలో చక్రం తిప్పుతున్నారని తెలిసింది. మరో ఎస్ఐ పోస్ట్ కోసం ఉన్నత స్థాయిలో లాబియింగ్ జరుగుతోందని తెలిసింది. హనుమాన్ జంక్షన్, వీరవల్లి, ఆత్కూరు ఎస్సైలను మార్చనున్నారని తెలిసింది. గతంలో గన్నవరంలో పని చేసిన ఇద్దరు ఎస్సైలను హనుమాన్ జంక్షన్, వీరవల్లిలో నియమించేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. పంచాయతీ కార్యదర్శుల విషయానికి వస్తే... ఎవరి ప్రయత్నాల్లో వారు పంచాయతీ కార్యదర్శులు, గహనిర్మాణ గ్రామీణ నీటి సరఫరా. పంచాయతీరాజ్ వంటి కీలక శాఖల డీఈలు. ఎఈలు తమకు అనుకూల స్థానాల కోసం ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలు సైతం అధికార పార్టీ పెద్దల్ని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. రెవెన్యూ కార్యాలయాల్లో ఆర్ఐ పోస్టులకు డిమాండ్ ఉంది. రానున్న రెండు వారాల్లోనే ఇవన్నీ దాదాపుగా కొలిక్కి వచ్చే సూచనలు కన్పిస్తున్నాయని రాజకీయ పెద్దలు అంటున్నారు. ఏదేమైనా నియోజకవర్గ నేత తనకు అనుకూలమైన వ్యక్తులను తెచ్చుకునే విషయంలో పై స్థాయిలో ఆటంకాలు ఎదురవుతున్నాయని వాదన వినిపిస్తుంది. ఆయనకు సంబంధం లేకుండా కొన్ని పోస్టులు పడుతున్నాయని పరిస్థితి ఉంది. ఈ విషయంలో నేత కాస్త సీరియస్‌గా ఉన్నారని తెలిసింది.

### ఎస్‌సిల సామాజికాభివృద్ధికి బడ్జెట్ నిధులు పెంచాలి

కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.క్రాంతి కుమార్, జి.నటరాజు, సహాయ కార్యదర్శి చింతల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జి.అరుణ, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాదిగాని గురునాథం తదితరులు కలిసి పలు సమస్యలను విన్నవించారు. దళితులకు ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ల బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని, ఎస్‌సిల అభివద్ధికి నిధుల కేటాయింపు, వాటి వినియోగాన్ని నిర్ధారించడానికి జాతీయ స్థాయిలో సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యా, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో ఎస్‌సిల భాగస్వామ్యం, సాధికారత మెరుగుదలకు తగిన వనరులు అందించాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని, దళితులపై అఘాయిత్యాల నిరోధానికి ఎస్‌సి, ఎస్‌టి యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. దీనిపై ఎంపి చిన్ని స్పందిస్తూ ఈ సమస్యలపై పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడతానని చెప్పారు.

### సాగునీటి సమస్యను పరిష్కరించండి

వేదిక మీ కోసం'లో ఇన్చార్జి డిఆర్‌ఒ జి.శ్రీదేవి, బందరు ఆర్‌డిఒ ఎం.వాణిలకు ఆయా సంఘాల నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించారు. అనంతరం హరిబాబు మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజి ఎగువ ఉన్న ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయని, ఈ నేపథ్యంలో దిగువ ప్రాంతాలకు సాగు నీటిని విడుదల చేయాలని కోరారు. భూ యజమాని ఆమోదం నిబంధనను తొలగించి వాస్తవ సాగుదారులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. రైతులు, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ప్రభుత్వ సాయం రూ.20 వేలు తక్షణం అందించాలన్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన విధంగా వెంటనే రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేయాలని కోరారు. ఆర్బీకెల ద్వారా రైతులు, కౌలు రైతులకు ఎరువులు అందించాలన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, రైతు సంఘం నాయకులు ఈడే రామారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అర్జీలకు సకాలంలో పరిష్కారం : డిఆర్ఒ



**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** ప్రజల నుండి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఇంచార్జ్ శ్రీదేవి అధికారులకు సూచించారు. సోమవారం డిఆర్ఓ నగరంలోని కలెక్టరేట్ సమావేశ హాలులో బందర్ ఆర్డీవో ఎం.వాణితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగాడిఆర్ఓ అధికారులతో మాట్లాడుతూ మీకోసంలో ప్రజల నుండి అందిన అర్జీలను గడువు దాటకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, అర్జీ దార్లకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చు అర్జీలపై దృష్టి సారించాలన్నారు. కోర్టు ధిక్కరణ కేసులలో కౌంటర్స్ ఫైల్ చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సర్వే ఏడి మనీషా త్రిపాఠి, ఆర్డీసీ డిఎం పెద్దిరాజులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విగ్రహానికి మరమ్మతులే చేయాలి : డిఎస్పి

**ప్రజాశక్తి-పెడన:** స్థానిక ఆరో వార్డు కృష్ణ తులసి థియేటర్ పక్కనే ఉన్న ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి మరమ్మత్తులు మాత్రమే చేసుకోవాలని, నూతన నిర్మాణాలు చేపట్టొద్దంటూ డి.ఎస్.పి అబ్దుల్ సుభాన్ వివరించారు. ఆదివారం అర్ధరాత్రి ఎస్సీ కాలనీలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చే ప్రయత్నం చేశారు. దీన్ని గమనించిన స్థానికులు మూకుమ్మడిగా హుటాహుటిన ముకుమ్మడిగా విగ్రహం వద్దకు చేరుకునే సరికి దుండగులు పారిపోయారని స్థానికులు చెబుతున్నారు. దీంతో విగ్రహం కూలిపోయే స్థితిలో ఉండడంతో వెంటనే మరమ్మతులు చేపట్టినట్లు కాలనీవాసులు వాపోతున్నారు. అయితే సమాచారం అందుకున్న ఎస్పై సూర్య శ్రీనివాసరావు తో పాటు సిఐ నాగేంద్రప్రసాద్, డి.ఎస్.పి అబ్దుల్ సుభాన్ లు ఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే స్థానికులు మరమ్మత్తు పనులు నిర్వహించడం చూసి వాటిని నిలువరించే దిశగా ప్రయత్నాలు చేశారు. దీంతో విగ్రహం కూలిపోయే దశలో ఉందని అందువల్లనే నిర్మాణం చేపట్టామని పోలీసులకు తెలిపారు. దీనిపై స్పందించిన డిఎస్పి అబ్దుల్ సుభాన్ రెండు రోజుల్లో మునిసిపల్, రెవెన్యూ అధికారులతో చర్చలు జరిపి విచారిస్తామన్నారు. అంతేకాకుండా విచారించిన అనంతరం విగ్రహానికి మరమ్మత్తులు నిర్మించుకోవచ్చు అని స్థానికులకు భరోసా కల్పించారు. ప్రస్తుతం ఈ అంశం 2019 నుంచి హైకోర్టులో ఉందని ఈ పరిస్థితుల్లో నూతన నిర్మాణాలు చేపట్టడం సరికాదన్నారు. దీంతో స్థానిక కాలనీవాసులు అలాగే జీవిత దళిత సంఘాల నాయకులు నిర్మాణ పనులను నిలిపివేశారు. ఈ సంఘటనలో బంటుమిల్లి, కత్తివెన్ను, గూడూరు ఎస్ఐలతో పాటు డిప్యూటీ తాసిల్దార్ కాగిత పూర్ణచంద్రరావు, ఆర్ఐ మణికుమార్, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు పరసా గోవిందరాజులు, వీఆర్వోలు ఘటనా స్థలంలో ఉన్నారు.

# దూరవిద్య కోర్సులపై అవగాహన

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా )**

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానం) ద్వారా అందిస్తున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఇన్చార్జ్ శ్రీదేవి అధికారులకు సూచించారు. సోమవారం డిఆర్ఓ చాంబర్స్ లో విద్యాశాఖ సంబంధిత శాఖల అధికారులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించి పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు పెంపునకు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయాల్లో ఉద్యోగులు పదోన్నతుల కోసం పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులు చేయడానికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కావున వారి వారి శాఖలలో అవసరమైన ఉద్యోగులకు ఈ కోర్సుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా అధికారులు, ఉద్యోగులు వారికి తెలిసిన వారికి ఈ సమాచారం అందించి ఈ కోర్సులలో ప్రవేశాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. విద్యాశాఖ జిల్లా పరీక్షల నిర్వహణ విభాగం అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ రాజు ఈ సమావేశంలో మాట్లాడుతూ ఎలాంటి విద్యార్హత లేకున్నా 14 సం. నిండిన వారు పదవ



తరగతిలో ప్రవేశానికి అర్హులని, 10వ తరగతి పాసైన వారు ఇంటర్మీడియట్ కోర్సు చేయడానికి అర్హులని తెలిపారు. మహిళలు, పలు వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్నవారికి, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు, వివిధ సంఘ సభ్యులకు ఇదొక చక్కని సదవకాశం అన్నారు. సెలవు దినాల్లో మాత్రమే తరగతులు నిర్వహించబడతాయన్నారు. ఈనెల 28వ తేదీలోగా నిర్దేశించిన కోర్సు రుసుం చెల్లించి పదవ తరగతి, ఇంటర్మీడియట్ లో ప్రవేశాలు పొందవచ్చని, 200 రూపాయల ఫైన్ తో సెప్టెంబర్ 4 వరకు చెల్లించవచ్చన్నారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంట కాల్వ అభివృద్ధి పనులు

**ప్రజాశక్తి-కోడూరు:** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక కృషితో పంట కాలువలకు మోక్షం లభించిందని టిడిపి కోడూరు మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కోడూరులో ప్రధాన పంట కాలువ నుంచి ఉల్లిపాలెం వెళ్లే 11వ నెంబర్ పంట



కాలువ అభివృద్ధి పనులు చేపట్టారు. అవనిగడ్డ ఇరిగేషన్ శాఖ డీఈఈ రావెళ్ల రవికిరణ్ పర్యవేక్షణలో పంట కాలువ పూడికతీత పనులు చేపట్టారు. పనులు జరుగుతున్న తీరును కోడూరు మండల కూటమి నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా బండే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గెలిచిన వెంటనే ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల అధికారులతో చర్చించి, సమగ్ర ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వ నిధులు సాధించారన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో షార్ట్ టెండర్ విధానంలో పనులు చేపట్టి నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కృషితో పంట కాలువలు, డ్రైనేజీలకు మోక్షం లభిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో గోగినేని సోమశేఖరరావు, ఉల్లి శేషగిరి, బచ్చు వెంకటేష్, మేడా శివాజీ, పిల్లి మల్లికార్జునరావు, వేములపల్లి శ్రీకృష్ణ బండే వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలు

**ప్రజాశక్తి-గుడివాడ :** అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని గుడివాడ సిడిపివో ఎ.విజయఫ్లోరెన్స్ అన్నారు. సోమవారం గుడివాడ పట్టణంలోని స్కావెంజర్స్ కాలనీ 6వ వార్డులో 2, 3 అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో విజయఫ్లోరెన్స్ గర్భవతులను, బాలింతలను ఉద్దేశించి గర్భం దాల్చిన నాటి నుండి డెలివరి సమయానికి 10 నుంచి 12 కిలోల బరువు పెరగాలన్నారు. అలాగే హిమోగ్లోబిన్ 12 శాతం ఉండాలన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే బిడ్డలకు ఇవ్వాలన్నారు. అలాగే అంగన్‌వాడీ నుండి అందే బాల సంజీవని కిట్లు, గుడ్లు, పాలు టేక్ హోమ్ రేషన్ అయిన బియ్యం, పప్పు, నూనె ఏవిధంగా ఉపయోగించాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె నాగజ్యోతి, టిడిపి నాయకులు ఆరేపల్లి పాండు పాల్గొన్నారు. పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సుష్మభారతి అన్నారు. సోమవారం స్థానిక బేతవోలు, నిమ్మతోటలోని అంగన్‌వాడీ 2, 3, 4 కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సుష్మభారతి మాట్లాడుతూ బాలింతలకు, గర్భవతులకు అంతరాలను పురించి తల్లి పాలను ప్రోత్సహించాలన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, వెంకటేశ్వరమ్మ, డి.వి.రమణ, కె.జాన్సీరాణి పాల్గొన్నారు.

**గన్నవరం:** బాపులపాడు మండలం కొత్తపల్లి గ్రామంలోని ముస్లిం ఏరియాలోని అంగన్వాడి సెంటర్లో తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతల తల్లులకు సిహెచ్ మల్లిక, ఎఎన్ఎం శ్రీదేవి, అంగనవాడీ కార్యకర్తలు కె కోటేశ్వరమ్మ, ఎం జ్యోతికుమారి, ఎస్‌కె చిన్న బీబీ జాన్, ఆశా కార్యకర్తలు, ఎం.కుమారి పాల్గొని తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**తోట్లవల్లూరు:** మండలంలోని వల్లూరుపాలెం అంగన్వాడి పాఠశాలలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్



గుడివాడలో మాట్లాడుతున్న సిడిపిఒ విజయ

డి.సుజాత తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అంగన్వాడి కార్యకర్తలు కె.మణిమ్మ, ఎన్.రాజ్యలక్ష్మి, బి.మేరీ సరిత, ఆర్. బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

**పెదపారుపూడి:** పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లి ముర్రిపాలు పట్టించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ కుమారి అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి అంగన్వాడి సెంటర్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా హాజరై తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మేడేపల్లి రజిని పాల్గొన్నారు.

**పమిడిముక్కల:** ముల్లపూడి అంగన్వాడి సెంటర్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఎఎన్ఎం ప్రభావతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## కాల్వలో పడి మెకానిక్ మృతి

**ప్రజాశక్తి-గుడివాడ:** స్థానిక పామర్రు రోడ్డులోని పెద్దకాలువలో సోమవారం ప్రమాదవశాత్తూ జారిపడి బైక్ మెకానిక్ బండి ప్రేమ్‌కుమార్ (26) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బండి ప్రేమ్‌కుమార్ ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం కాలువలో పడి మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దుకాణంలో చోరీ

**ప్రజాశక్తి-కంకిపాడు:** చలివేంద్రపాలెం గ్రామంలో నివాసం ఉంటున్న దొడ్డ గణేష్‌కుమార్ చలివేంద్రపాలెం-నెప్పల్లి సెంటర్‌లో లక్ష్మీ జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో షాపు మూసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం 7:15 గంటల సమయంలో షాపు తెరిచి చూడగా షాపుపై రేకులు పగలగొట్టి, షాప్ కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.60 వేల నగదు దొంగతనం చేసారని గుర్తించి కంకిపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నెల్లూరు సెంట్రల్ జైలుకు నిందితులు

**ప్రజాశక్తి-గన్నవరం:** ఏడాదిన్నర క్రితం గన్నవరంలోని టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో మరో ఐదుగురిని గన్నవరం పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు. 2023 ఫిబ్రవరి 20న జరిగిన ఈ ఘటనలో మొత్తం 71 మందిని నిందితుల జాబితాలో పోలీసులు చేర్చారు. వీరిలో ఇప్పటికే 20 మందిని అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు నూజివీడు, గన్నవరం సబ్ జైళ్లకు తరలించారు. తాజాగా పోలీసులు మెండెం రాంబాబు, సయ్యద్ సిద్ధిక్, జంగా అమరేంద్రరెడ్డి, షేక్ ఇమ్రాన్, షేక్ ఇర్ఫాన్ ను అరెస్ట్ చేశారు. అనంతరం వీరిని విజయవాడలోని ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కోర్టులో హాజరుపరచారు. ఐదుగురికి కోర్టు ఈ నెల 16వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

## చల్లపల్లి తహశీల్దార్‌గా వనజాక్షి

**ప్రజాశక్తి-చల్లపల్లి:** చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్ వనజాక్షి బాధ్యతలు సోమవారం చేపట్టారు. ఆమెకు డీటీ కుమార్ బాధ్యతలు అప్పగించారు. కార్యాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా



వనజాక్షి మాట్లాడుతూ రెవెన్యూ సేవలు వేగవంతం చేస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు.

## పేదలకు అన్నదానం


**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** స్థానిక లయన్స్ సేవా భవనంలో సోమవారం ఈడే వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. ఈడే వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం



వారి కుటుంబ సభ్యుల సహకారంతో 50 మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పెరుమాళ్ల, వైపిసి ప్రసాద్, వి.సుబ్బారావు, జంగం మోహనరావు, బొప్పన శ్రీనివాసరావు, పి.విజయ్, ఎస్.పరంధామయ్య, పాతూరి బుజ్జి పాల్గొన్నారు.

## ఘంటసాల తహశీల్దార్‌గా విజయప్రసాద్

**ప్రజాశక్తి-ఘంటసాల:** ఘంటసాల మండల తహశీల్దార్‌గా బి.విజయప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కాకినాడ రూరల్ తహసీల్దార్‌గా పని చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో విజయప్రసాద్‌ను ఘంటసాలకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా



డిటి చప్పిడి చిట్టిబాబు, రీ సర్వే డిడి శ్రీనివాస్, మండల సర్వేయర్ వల్లి పుష్ప, వీఆర్వోలు ఎస్.వి.నాగేశ్వరరావు, కర్రా నాగరాజు, టి.రవికుమార్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి : వసంత

**ప్రజాశక్తి - మైలవరం :** విద్యతోనే సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎంబిఎం జెడ్పి గర్ల్స్ హైస్కూల్ ప్లస్‌లో సోమవారం పదో తరగతిలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన బాలికలకు, ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థినిలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి కష్టపడి విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేసిన ఉపాధ్యాయులు శరత్ బాబు, సుశీల, శ్రీరామ్, సుమ, రమాదేవిలను అభినందించారు. అనంతరం వివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 250 మంది విద్యార్థులకు ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మైలవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహన్ రావుతో కలిసి పార్టీ పుస్తకాలు బ్యాగులు నోటు పుస్తకాలను అందజేశారు.

## ప్రజావసరాలకు అనుగుణంగా సేవలు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** వాసవి క్లబ్స్ ఇంట ర్నేషనల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు అంతర్జాతీ య అధ్య క్షులు ఆర్.రవి చంద్రన్ తెలిపారు.


విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ అనంతరం క్లబ్ అధ్యక్షులు రవిచంద్రన్, సభ్యులు

ప్రజల అవసరాలను గుర్తించి వారికి క్లబ్ తరపున సహాయ సహకారాలను అందిస్తున్నట్లు తెలిపారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షులు ఆర్.రవిచంద్రన్, ఆర్.చిత్ర రవిచంద్రన్ దంపతులు క్లబ్ పర్యటనలో భాగంగా నగరానికి విచ్చేసిన సందర్భంగా వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా వి212ఎ రీజియన్ 1 ఆధ్వర్యంలో భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని ఓ హోటల్‌లో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యుల ఆహ్లాద కలయిక సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు అంతర్జాతీయ అధ్యక్షులు ఆర్.రవిచంద్రన్ దంపతులను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రవిచంద్రన్ మాట్లాడుతూ వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అనేది ఒక అంతర్జాతీయ సంస్థ అని అందులో లక్షమంది సభ్యులు ఉన్నారని, 1860 క్లబ్స్ ఉన్నాయని చెప్పారు. వేద పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పన, పాఠశాలలకు వాటర్ ట్యాంక్, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, వైద్య శిబిరాలు వంటి పలు కార్యక్రమాలు క్లబ్ తరపున నిర్వహిస్తున్నామని చెప్పారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా వి212ఎ రీజియన్ 1 గవర్నర్ కె.సతీష్ కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ అధ్యక్షులు ఆర్. రవిచంద్రన్ గుడ్‌విల్ విజిట్ సందర్భంగా జిల్లాలోని 72 క్లబ్‌లలో 50 క్లబ్‌లు గుడ్ విల్ విజిట్ చేస్తాయని, రకరకాల సేవా కార్యక్రమాలు చేస్తాయన్నారు. రీజియన్ 1 ఆర్థి కందుకూరి అనిల్ ఆధ్వర్యంలో ఆరు క్లబ్‌లు పాల్గొని సేవా కార్యక్రమాలు చేశాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్ర కీలాద్రి దుర్గమ్మను తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ సి.పార్థ సారథి దంపతులు వారు



సోమవారం శ్రీ అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణా ఎలక్షన్ కమిషనర్ దంపతుల వారు అమ్మవారిని దర్శనం చేసుకొనగా, వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీరికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

## శ్రీసత్యమ్మ హుండీ లెక్కింపు

**ప్రజాశక్తి- నందిగామ :** నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానం హుండీలను నందిగామ డివిజన్ దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పి. ఫణి కుమార్ పర్యవేక్షణలో మరియు దుర్గ శివ సాయి సేవాదళ్ సభ్యుల సమక్షంలో తెరచి లెక్కించారు. 39 రోజులకు రూ.6,01,670లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పి. సీతారామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## 7వ సెంట్రల్ పేకమిషన్ అమలు చేయాలి

**విజయవాడ :** బిఎస్‌ఎన్‌ఎల్ పింఛను దారులకు కేంద్ర ప్రభుత్వం 2016 లో చేసిన సెంట్రల్ పే కమిషన్ సూచనలు అమలు చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సంఘం 16వ సర్వ సభ్య సమావేశం సోమవారం స్థానిక రఘురామ వేదిక (మోహన్ దాస్)లో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దాదాపుగా ఎనభై ఏళ్ళు పైబడి వర్ధాప్యంలో చాలాకాలం తర్వాత కలవడంతో ఒకరినొకరు ఆత్మీయ అనుభూతిని పొందారు. ఎనభై పై బడిన 75 మందిని సత్కరించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ఎపి సర్కిల్ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ సంస్థలో నష్టాల పేరుతో సిబ్బందికి పదేళ్లుగా పే రివిజన్ చేయలేదని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ లైవ్ సర్టిఫికెట్లు (బ్రతికి ఉన్నట్లు ధృవీకరణ)



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలని కోరారు. సంఘం సీనియర్ నాయకులు ఎమ్ఆర్ఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి సంఘం ఎంతో కృషి చేస్తుందని వివరించారు. సమావేశానికి కె.పూర్ణచంద్రరావు అధ్యక్షత వహించగా కార్యదర్శి చొరగుడి భాస్కరరావు, కోశాధికారి జి శివ, నాగేశ్వరరావు, చీఫ్ అడ్వైజర్ డి.దుర్గారావు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యసాధనకు పాటుపడాలి

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** విద్యార్థులు లక్ష్యసాధనకు పాటుపడాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పాలకవర్గ అధ్యక్షులు చలవాది మల్లికార్జునరావు అన్నారు. బీటెక్ మొదటి ఏడాది కొత్త విద్యార్థులకు తరగతులు ప్రారంభం, పరిచయ కార్యక్రమాలను ఆ కళాశాల సెమినార్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన చలవాది మల్లికార్జునరావు మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. విద్యార్థుల అభివృద్ధికి



మాట్లాడుతున్న చలవాది మల్లికార్జునరావు

అవసరమయ్యే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కే. రాఘవయ్య, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## వరుసగా రెండోసారి ఉత్తమ హెల్త్ కేర్ అవార్డు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** హెల్త్ కేర్ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న అమృతాంజన్ హెల్త్‌కేర్ సంస్థకు వరుసగా బెస్ట్ హెల్త్ కేర్ బ్రాండ్‌గా అవార్డు లభించిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.శంభుప్రసాద్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. బెస్ట్ హెల్త్ కేర్ బ్రాండ్‌గా తమకు అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. వినియోగ దారులకు ఉత్తమ హెల్త్‌కేర్ సొల్యూషన్స్‌ను అందించడంలో అత్యుత్తమంగా తమ సంస్థ నిలిచిందన్నారు. తాము చేసే నిరంతర కృషి, అంకితభావం, సంస్థ సిబ్బంది వల్లనే అవార్డు లభించిందన్నారు. రానున్న కాలంలో కూడా మంచి ఉత్పత్తులను అందించి అత్యుత్తమ బ్రాండ్‌గా గుర్తింపు అలాగే ఉండేలా కృషి చేస్తామన్నారు. రానున్న కాలంలో మరిన్ని హెల్త్ కేర్ ఉత్పత్తులను అందించేలా తమ సంస్థ కృషి చేస్తుందన్నారు.

## బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి జైలు

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ఓ బాలిక పట్ల అత్యాచారం చేసిన కేసులో ఓ వ్యక్తికి జీవిత జైలు శిక్ష విధించారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొత్తపేట కే.ఎల్.రావు నగర్‌కు చెందిన మైనర్ బాలిక (16) వాళ్ళ అమ్మ, చెల్లితో కలిసి నివాసం ఉంటుంది. ఈ క్రమంలో ఇనస్టాగ్రామ్‌లో తెలంగాణా రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఎం.డి. ఖాజా మొహిద్దీన్ (22) అనే యువకుడు పరిచయమై, ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతో రమ్మనగా నమ్మి బాధితురాలు వెళ్ళగా బాధితురాలిని హైదరాబాద్, కర్నూలులో తిప్పుతూ అక్కడ లాడ్జిలోనికి తీసుకొని వెళ్ళాడు. అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆ బాలికను కొన్ని ఊర్లు తిప్పి తన దగ్గర డబ్బులు అయిపోయాయని బస్సు ఎక్కించి విజయవాడకు పంపించి వేశాడు. ఇంటికి వచ్చిన అనంతరం బాలిక తల్లితో సదరు జరిగిన విషయం చెప్పగా 2023 జూన్ 5న కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు పోలీసులు ఫోక్సో యాక్ట్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి కొత్తపేట ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం సదరు కేసు దర్యాప్తు చేసి నిందితుడైన తెలంగాణా రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఎం.డి.ఖాజా మొహిద్దీన్‌ను 2023 జూన్ 13వ తేదీన అరెస్ట్ చేసి సి.ఎం.ఎం కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం నిందితుడు ఎం.డి.ఖాజా మొహిద్దీన్‌పై నేరం ఋజువైనందున సోమవారం విజయవాడ ఫోక్సో కోర్టు ఇన్‌ఛార్జ్ జడ్జి తిరుమల వెంకటేశ్వర్లు నిందితుడుకి జీవిత ఖైదు, కఠినకారాగార జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. సదరు జరిమానా మొత్తం బాలికకు చెందేలా ఆదేశించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ గుజ్జుల నాగిరెడ్డి, అప్పటి టూటౌన్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, సిఎంఎస్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పర్యవేక్షణలో 13 మంది సాక్షులను విచారించారు.

## భూమి ఆక్రమణపై ఫిర్యాదు

**ప్రజాశక్తి - తిరువూరు :** దేవాదాయ శాఖ భూమిలో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తిరువూరు నగర పంచాయతీ 9వ వార్డు కౌన్సిలర్ మూడు దుర్గారావు సోమవారం ఆర్ డిఒకు ఫిర్యాదు చేశారు. తిరువూరు మెయిన్ రోడ్డు, ఎంపిడిఒ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో సర్వేనెంబర్ 198/1లో రెవెన్యూ రికార్డు ప్రకారం దారా గురునాథం ధర్మసత్రం, దేవాదాయ శాఖకు సంబంధించిన భూమిని ప్రస్తుతం అడంగల్‌లో ఇళ్లు, ఇళ్ల స్థలాలుగా కొంతమంది అధికారులు చేసిన తప్పుల వల్ల ఎంతో విలువైన భూమిని రికార్డుల్లో తారుమారు చేసి మోసానికి పాల్పడ్డారని పేర్కొన్నాడు. ఈ విషయంలో దేవాదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పాత తిరువూరు రెవెన్యూలోని సర్వే నెంబర్ 134/2లో ఉన్న కన్యకా పరమేశ్వరి సత్రం సంతతి గల 4 ఎకరాల 28 సెంట్లు వ్యవసాయ భూమిని కూడా దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంగా ఎన్నో ఏళ్లుగా బహిరంగ వేలం వేయకుండా దారా శ్రీనివాసరావు కౌలుకు ఇచ్చి దేవాదాయ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారని దుర్గారావు ఆరోపించారు. ధర్మకర్తని చెప్పుకునే దారా శ్రీనివాసరావు నగర పంచాయతీ టౌన్‌ప్లానింగ్ అప్రూవల్ లేకుండా, దేవాదాయ శాఖ అధికారులకు తెలియకుండా అక్రమంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా తన సొంతంగా షాపులను లీజుకు ఇచ్చి ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని కాజేసేందుకు పూనుకున్నారని చెప్పారు. వెంటనే విచారణ చేపట్టి షాపింగ్ కాంప్లెక్స్ స్వాధీనపరచుకొని శ్రీనివాసరావుపై సమగ్రమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒను దుర్గారావు కోరారు.

## పలు సమస్యలపై కమిషనర్‌కు వినతి

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** కొండపల్లి మున్సిపాలిటీలోని 5వ డివిజన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొండపల్లి మున్సిపల్ కమిషనర్ వై.శంకర్ నాయక్‌కు కొండపల్లి మున్సిపాలిటీ 5వ డివిజన్ కౌన్సిలర్ మొగిలి దయ వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాకాలపు వాతావరణ వల్ల డ్రైనేజీలు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా లేకపోవడంతో దోమలు ఏర్పడి డెంగ్యూ మలేరియా చికెన్ గునియా, విషపు జ్వరాల చేత మున్సిపాలిటీలో ఉన్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని



కోరారు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు.



## డాక్టర్ రాజారావు మృతి

**జగ్గయ్యపేట :** జగ్గయ్యపేట ప్రాంత ప్రజలకు లెప్రసీ డాక్టర్‌గా సుపరిచితులైన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఒ) రాష్ట్ర మాజీ ప్రతినిధి డాక్టర్ బిరుదుగడ్డ రాజారావు ఆదివారం పట్టణంలో ఆయన నివాసంలో మృతిచెందారు. సోమవారం రాజారావు అంతిమయాత్రలో టిడిపి జాతీయ కోశాధికారి, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సోదరుడు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం చిన్నబాబు పాల్గొని పాడె మోసి నివాళులర్పించారు.

## 10న జాబ్ మేళా

**ప్రజాశక్తి - భవానీపురం :** సుజనా ఫౌండేషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 10వ తేదీన భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో జరగనున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ సూచించారు. సోమవారం ఎన్డీయే కార్యాలయంలో కూటమి నాయకుల కార్యకర్తల సమావేశం నిర్వహించి జాబ్ మేళా విధివిధానాలను స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు టెక్ మహీంద్రా, అరబిందో ఫార్మా, రిలయన్స్ జియో, బిగ్‌సి, బిగ్ బాస్కెట్, ఐసిఐసిఐ బ్యాంక్, అపోలో ఫార్మసీ, బ్యాంకింగ్, నవత ట్రాన్స్‌పోర్ట్ వంటి, అనేక బహుళ జాతీయ కంపెనీలు హాజరై మూడు వేల ఉద్యోగాలకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, డిప్లమా, ఇంజనీరింగ్ చేసిన అభ్యర్థులు పాల్గొనాలని కోరారు. సంబంధిత సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరు కావాలన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 7032399488, 9000412345 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ గుడివాడ కృష్ణ కిషోర్, ఇన్చార్జ్ చింతపల్లి అజయ్ బాబు, మోహన్ వంశీ, కార్పొరేటర్ బుల్లా విజయ్, బొమ్మ కంటి వెంకటరమణ, కుమార్ పాల్గొన్నారు.



## పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం

**ప్రజాశక్తి వత్సవాయి :** పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిత్రాల వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని మక్కపేట జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఆ గ్రామానికి చెందిన అలావతూ పార్వతమ్మ జ్ఞాపకార్థం వారి మనవడు గుగులోతు స్వామి పాఠశాల అభివృద్ధి కోసం పదివేల 16 రూపాయలు, బాణావతి నాగమ్మ కుమారుడు సత్యనారాయణ రూ.10వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ దాతల సహకారం పాఠశాల అభివృద్ధి చేస్తామని తెలిపారు. నగదు అందజేసిన గుగులోతు కోటయ్యనూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అజ్మీర్ శ్రీనివాసరావు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

## సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, ఇది సరైన పద్ధతి కాదని సిఐటియు కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించుకున్న కూటమి ప్రభుత్వం ఆదిలోనే హంసపాదులా అప్పుడే స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు మొదలుపెట్టిందన్నార. ఉద్యోగులను మార్చాలంటే ఎన్నో నిబంధనలు ఉన్నాయని, ముందుగా మెమో ఇవ్వాలని తర్వాత షోకాజ్ ఇచ్చి సమాధానం కోరిన తర్వాతే దానిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇలా కాకుండా క్షేత్రస్థాయిలో ఇష్టానుసారం రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారని, ఇది ఆ ప్రభుత్వానికి మంచిది కాదాన్నారు. అంగనవాడి, ఆశ, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులను, స్కూల్ శానిటైజర్ కార్మికులను అనేక రకాలుగా వేధిస్తూ తొలగించడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లను స్థానిక గ్రామ పెద్దల కక్షలతో తొలగించడం అన్యాయమన్నారు. ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మక్క మాట్లాడుతూ నెలకు మూడు వేల జీతం వచ్చే వంటలమ్మ మీద ఒంటికాలితో యుద్ధానికి రావడం ఈ ప్రభుత్వానికి తగదన్నారు.


ఇన్‌ఛార్జి డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు పేద పిల్లలకు ఆహారాన్ని అందించే క్రమంలో నెలనెలా బిల్లులు రాకపోయినా అప్పులు చేసి పిల్లలకు ఆహారం అందించడం జరుగుతుందని, ఈ పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ శ్రీదేవికి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ జయరావు, ఏపీ మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.మురళి, రమాదేవి, వివోఏ యూనియన్ జిల్లా కార్యదర్శి రజిని, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

# రాజీనామా చేయండి... లేకుంటే మేమే తొలగిస్తాం

## స్కీమ్ వర్కర్లకు అధికారి పార్టీ నేతల బెదిరింపులు

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** 'మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. ఇప్పటివరకు మాతో పాటు మా కార్యకర్తలందరూ కష్టపడ్డారు.. కనుక వారికి ఏదో విధంగా మేము సహాయ సహకారాలు అందించి ఉపయోగపడాలి... కాబట్టి మాకు దగ్గరలో ఉన్న చిన్న పోస్టులను మా వాళ్ళతో భర్తీ చేసుకుంటాం... కనుక మీరంతా రాజీనామా చేసి వెళ్లిపోండి... ఆ పోస్టుల్లో మా వాళ్లను నియమిచ్చుకుంటాం' అంటూ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో అధికార పార్టీకి చెందిన నేతలు స్కీమ్ వర్కర్లపై బెదిరింపులకు దిగుతున్నారు. అధికారం చేపట్టి రెండు నెలలు కూడా కాకముందే గతంలో ఎన్నడూ లేని విధంగా స్కీమ్ వర్కర్లపై అధికార పార్టీ నేతలు ఇటువంటి బెదిరింపులకు దిగడం శోచనీయంగా ఉందని పలువురు స్కీమ్ వర్కర్లు తెలుపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని సంస్కృతికి ఇప్పుడు అధికార పార్టీ నేతలు పునుకుంటున్నారని దీనివల్ల ఎన్నో ఏళ్లుగా ఈ వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, కాబట్టి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని పలువురు స్కీమ్ వర్కర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.



### 15 సంవత్సరాలుగా పని చేస్తున్నా

2009వ సంవత్సరం నుండి తాను పనిచేస్తున్నా. ఇప్పుడు మా గ్రామంలో టిడిపి కార్యకర్తలు కొండ్రు రఘురాం వచ్చి మా ప్రభుత్వం వచ్చింది మా వాళ్లను నియమించుకుంటాం కాబట్టి మీరు రాజీనామా చేసి వెళ్లిపోవాలని గన్నవరం మండలం మోటే పల్లి గ్రామం ఎంపీపీ స్కూల్లో శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్న దేవరపల్లి దివ్య తెలిపారు. ఇలా ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికులను మార్చేస్తం అంటే ఎలా కాబట్టి ప్రభుత్వ పెద్దలు అధికారులు క్షేత్రం స్థాయిలో స్కీం వర్కర్ల పై జరుగుతున్న రాజకీయ వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు.



### రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారు

మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి మా వాళ్లను నియమించుకుంటాం మీరు రాజీనామా చేసి వెళ్లిపోండి అంటూ బందరు మండలం చిన్నయాదర గ్రామ సర్పంచ్ గళ్ల తిమోతి బెదిరిస్తున్నాడని గ్రామ ఎలిమెంటరీ పాఠశాలలో ఆయా మరియు శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్న చాట్రగడ్డ సీతమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



### బెదిరింపులు ఎక్కువయ్యాయి

గెలిచిన మూడో రోజు నుండే తొట్ల వల్లూరు మండలంలోని స్కీం వర్కర్లకు బెదిరింపులు మొదలయ్యాయని ఆశ కార్యకర్త గుడిసె నాగేంద్రమ్మ తెలిపింది. కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రతిరోజు సచివాలయానికి సంతకం పెట్టి వెళ్లాలని చెప్పారని అయితే దీన్ని తామంతా వ్యతిరేకించామని తెలిపారు. ఎప్పుడు లేని రూలు ఇప్పుడు ఎందుకు పెడుతున్నారు చెప్పాలని ప్రశ్నించడం జరిగిందన్నారు. సంతకం పెట్టకపోతే మీ సంగతి చూస్తామని అధికార పార్టీ నేతలు బెదిరించారని అయినా తామేమి ఖాతార్ చేయలేదన్నారు. కాబట్టి ప్రభుత్వ పనితీరులో రాజకీయ నాయకుల జోక్యాన్ని అధికారులు నివారించాలని డిమాండ్ చేశారు.



## ట్రిపుల్ ఐటి విద్యార్థికి సత్కారం

**ప్రజాశక్తి-చల్లపల్లి:** పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన నిరుపేద ప్రతిభావంతులకు ట్రిపుల్ ఐటిలు ఒక వరం అని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు పేర్కొన్నారు. నాదెళ్లవారిపాలెం ఎస్సీ వాడకు చెందిన మేడేపల్లి జ్యోతి ఒంగోలు ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిశ్రీని సోమవారం మెమొంటోతో ఘనంగా సత్కరించారు. సురేష్‌బాబు మాట్లాడుతూ ట్రిపుల్ ఐటిలో మంచి మార్కులతో ప్రతిభ చూపితే కార్పొరేట్ కంపెనీలలో అనేక ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని సూచించారు. ప్రస్తుత అవసరాల దృష్ట్యా రాష్ట్రంలో ట్రిపుల్ ఐటిల సంఖ్య పెంచేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేత ఎం.సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## శాస్త్రవేత్త సతీష్‌రెడ్డికి మండలి పురస్కారం

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు 99వ జయంతి సందర్భంగా గాంధీ క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో భారత రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్‌రెడ్డికి మండలి వెంకటకృష్ణారావు స్మారక తెలుగు వైభవ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష వైభవం కోసం పాటుపడిన మహనీయులు మండలి వెంకటకృష్ణారావు అన్నారు. మండలి ఫౌండేషన్ ద్వారా ఈ పురస్కారం అందుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. రక్షణ పరిశోధన రంగంలో భారతదేశం ప్రపంచానికే నాయకునిగా ఎదుగుతుందన్నారు. నిమ్మకూరులో ఏర్పాటు చేసిన బెల్ కంపెనీ ద్వారా త్వరలో ప్రపంచానికి ఎగుమతులు ఉంటాయన్నారు. నాగాయలంక మండలం గుల్లలమోద క్షిపణి పరిశోధన కేంద్రం త్వరలో సాకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, ఎంపి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్, జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి, సిలికాన్ ఆంధ్ర వ్యవస్థాపకులు కూచిబుట్ల ఆనంద్ జమీన్, రైతు సంపాదకులు గోలేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## మంత్రి భరత్ పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి-గుడివాడ:** స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గోకవరపు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి టిజి భరత్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, ఆర్యవైశ్య నాయకులు తిరివీధి సుబ్బారావు, సూరే గాంధీ, బెజవాడ బాగేశ్వరరావు, పరిశే వెంకటేశ్వరావు, తాడిపర్తి సురేష్, ఇడుపుల జగత్ పాల్గొన్నారు.



## వృద్ధులకు భోజనాలు పంపిణీ

**ప్రజాశక్తి-గుడివాడ:** మానవ సేవే మాధవసేవగా శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శాంతి వృద్ధుల ఆశ్రమం, కరుణా పీఠంలలోని వృద్ధుల ఆశ్రమాలలో భోజనాలు అందజేశారు. ఈ సందర్భంగా తాలుకా పోలీసుస్టేషన్ ఎస్ఐ లక్ష్మీనరసింహమూర్తి, రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ మాట్లాడుతూ కరేటి లవరాజు, రాధల కుమార్డు యశ్వంత్ పుట్టినరోజు సందర్భంగా శాంతి వద్ధాశ్రమం, కరుణాపీఠం వద్ధాశ్రమంలో వద్ధులకు భోజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, మాకుల సత్యం, జాజుల తాతరావు, కరేటి రామచంద్రారావు, పద్మవతి, ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, తలకొండ సత్యనారాయణ, కంతేటి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



## ఐటిఐలో మూడో విడత అడ్మిషన్లు

**ప్రజాశక్తి-గుడివాడ :** ఐటిఐలో ఎస్ఎస్‌సీ, 8వ తరగతి పాస్ అయిన అభ్యర్థులు మూడో విడత అడ్మిషన్‌ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని కె.బి.ఆర్ ప్రభుత్వ శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ కన్వీనర్ ఎల్.గౌరిమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీలోపు రిజిస్ట్రేషన్‌ను అప్రూవల్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 29, 31 తేదీల్లో స్థానిక కెబిఆర్ ప్రభుత్వ ఐటిఐలో జరిగే కౌన్సిలింగ్ జరుగుతుందని, ఇతర వివరాలకు 08674 -295953, 8297574757 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



## తహశీల్దార్‌గా శివయ్య బాధ్యతలు


**ప్రజాశక్తి-గన్నవరం**

గన్నవరం తహశీల్దార్‌గా కె.వి.శివయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈయన గతంలో పెనమలూరు, తోట్లవల్లూరు మండలాల్లో పనిచేశారు.



## ఈ పంట నమోదు తప్పనిసరి

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు:** రైతులు ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో తాసిల్దార్ కుసుమకుమారితో కలిసి విఎఎ, విఆర్‌ఒలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో ఈ పంట నమోదు గురించిన పూర్తి వివరాల గురించి అవగాహన కల్పించారు. రైతులు ఈకేవైసీ, ఈ పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని, విఏఏ లు,వీఆర్వోలు విధులు సక్రమంగా నిర్వహించి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ విధానాల అవలంబించడం వలన ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.





## తాతయ్య, నానమ్మలతో 'ఈ ఒక్కరోజు'

**ప్రజాశక్తి - గంపలగూడెం :** ఊటుకూరు జీవీ అకాడమీ (ప్రైవేట్ పాఠశాల)లో సరికొత్త కార్యక్రమానికి తెర లేపారు. ఒక్కరోజు పాఠశాలలో తాతయ్య, నానమ్మలతో విద్యార్థులు కలిసి కోలాహలంగా పాల్గొన్నారు. పలు ఆటపాట్లతో రెండు గంటలపాటు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని కొనసాగించారు. దీనితో మనమలు, మనుమరాళ్ళు చదువుతున్న పాఠశాల పరిస్థితులను చూసి ఆస్వాదించేందుకు ఈ ఒక్కరోజు కార్యక్రమం వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెరుకూరి కృష్ణారావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్యంతోనే రోగ నివారణ

**ప్రజాశక్తి - గంపలగూడెం :** గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచడంతోనే రోగం నివారణకు బావుంటుందని గాదవారిగూడెం గ్రామ సర్పంచ్ చెన్నా శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో అంతర్గత రహదారుల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లీచింగ్, సున్నం చల్లి ఈగలు, దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టారు.

## నూతన తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - చందర్లపాడు :** చందర్లపాడు తహశీల్దార్‌గా పాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పాల్ మాట్లాడుతూ మండలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని రైతులకు ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా నేరుగా వచ్చి తనను కలవచ్చని తెలిపారు. రైతులకు ఎటువంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరిస్తానని ప్రజలకు రెవిన్యూ కార్యాలయంలో ఎటువంటి పని ఉన్న వెంటనే పరిష్కారం చేసే దిశగా పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో చందర్లపాడు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** మైలవరం తహశీల్దారుగా జిట్టా బాలకృష్ణారెడ్డి సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా గంపలగూడెం మండలం నుంచి మైలవరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీలకతీతంగా పనిచేస్తానన్నారు. **నందిగామం :** నందిగామ మండల తహశీల్దార్‌గా ఎన్.సురేష్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. **భవానీపురం :** విజయవాడ పశ్చిమ తహశీల్ధార్‌గా ఇంతియాజ్ పాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న తహశీల్ధార్ కిషోర్ బాబు రాజమండ్రికి బదిలీ అయ్యారు. రాజంపేట ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న ఇంతియాజ్ పాషా సోమవారం పశ్చిమ తహశీల్ధార్‌గా పదవి బాధ్యతలు చేపట్టారు. **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం నూతన తహశీల్దారుగా వై.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సెక్రటేరియట్లో విధులు నిర్వహిస్తున్న వై వెంకటేశ్వర్లు బదిలీపై ఇబ్రహీంపట్నం వచ్చారు. **విస్సన్నపేట :** విస్సన్నపేట మండల తహశీల్దార్‌గా కె.లక్ష్మీ కళ్యాణి బాధ్యతలు స్వీకరించారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి - వీరులపాడు :** వీరులపాడు గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థో, గైనిక్ విభాగాల్లో ఉచితంగా ఇసిజి, ఎకో, మధుమేహం, బిపి తదితర పరీక్షలను అవసరమైన వారికి ఉచితంగా పరీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వైద్య శిబిరం ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. వైద్యుల సలహాపై అదనపు పరీక్షల కోసం మెడికల్ కాలేజీ వారే ఉచిత బస్‌ని ఏర్పాటు చేసి మెడికల్ కాలేజ్‌లో 50 శాతం డిస్కౌంట్‌కే పరీక్షలు చెయ్యనున్నట్లు నిమ్స్ సిఇఒ విశ్వచరణ్ తెలిపారు. ఈ కాంప్‌ని విజయవంతంగా నిర్వహించటంలో సిపిఐ సీనియర్ నాయకులు, వీరులపాడు మాజీ సర్పంచ్ వట్టికొండ చంద్రమోహన్ అందించిన సహాయ సహకారాలు మరవలేనివని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మండూరి ప్రకాశరావు, వాసిరెడ్డి రాధాకృష్ణ, టిడిపి నాయకుడు నల్లమల ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

# వయనాడ్ విపత్తు బాధితులను ఆదుకోవాలని విరాళాల సేకరణ



జగ్గయ్యపేట


ఏ కొండూరు


తిరువూరు

**జగ్గయ్యపేట :** కేరళలోని వయనాడ్ విపత్తు బాధితులను ఆదుకోవాలని కోరుతూ పట్టణంలోని సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ కేరళలోని వరదల వలన ఎంతో ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, ఇటువంటి సంఘటన జరగటం దురదష్టకరమని ప్రతి ఒక్కరు స్పందించి విరాళాలు అందజేసి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎం నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, రామనాథం, షేక్ గౌస్ మయా, కోటా రవికుమార్, వి వి రాంప్రసాద్, రావెళ్ళ శేషు, దాసరి నాగేశ్వరరావు, భూశమ్మ, బాలు, ఎలకమ్మ తదితరులు పాల్గొన్నారు. **ఏ కొండూరు :** కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో ఇటీవల సంభవించిన వరదల వల్ల వందలాదిమంది మృతిచెందగా మరో వందలాది మంది ఆచూకీ తెలియకుండా పోయింది. వారి కుటుంబాలకు సహాయార్థం సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం చీమలపాడులో విరాళా సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు పి ఆనందరావు, ఎ.అమ్మిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో సేకరించిన విరాళాలను పార్టీకి అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర పార్టీ ద్వారా కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించడం జరుగుతుందన్నారు. వయనాడ్ బాధితులను ఆదుకోవాలని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి తమ వంతు విరాళాలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంబి వెంకటేశ్వరరావు సోమ మోహనరావు లక్ష్మయ్య సర్వేసోములు తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** కేరళ రాష్ట్రంలో ఇటీవల ప్రకృతి విలయానికి అతలాకుతలమైన వయనాడ్ వరద బాధితులకు సహాయ నిధికి సిపిఎం నాయకులు, కార్య కర్తలు తిరువూరు పట్టణంలో సోమ వారం విరాళాల సేకరణ చేశారు. ఫ్యాక్టరీ సెంటర్ నుండి మెయిన్ రోడ్డు మీదగా చీరాల సెంటర్ బస్టాండ్ వరకు షాపు షాపుకు వెళ్లి జోలిపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులు బాటసారులు, చిన్నారులు సైతం విరాళాలు అందజేశారు. ప్రతి ఒక్క రు బాధ్యతగా కేరళ వరద బాధితులకు అండగా నిలిచారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వి.భద్రం, పంతంగి శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు, కాగిత రాము, సాంబారు వెంకటేశ్వర్లు, పాకాల రామ కష్ణ ఎం.తిరుప తిరావు, కె.వెంకటరత్నం, ఎం.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

## గుండేపల్లిలో ఎత్తిపోతల పథకం ప్రారంభం

**ప్రజాశక్త - కంచికచర్ల :** ఎత్తిపోతల పథకాల ద్వారా ప్రాధాన్యత క్రమంలో పంటలకు సాగునీటిని వినియోగించుకోవాలని నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో మరమ్మత్తుల పూర్తి చేసిన కీసర ఎత్తిపోతల పథకం పంపింగ్ స్కీమ్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలుత స్థానిక సింథని సంస్థ వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎత్తిపోతల పథకం మరమ్మత్తుల పనులకు రూ.25 లక్షలు అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. రైతు తమ పంట పొలాల్లో పండించుకునేందుకు ఈ స్కీం నీరు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కోగంటి బాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు మందడపు రామకృష్ణ నాయకులు కంటమనేని



రామ్మోహన్ రావు బొక్క రత్నం, బొక్క దేవ నందం నందిగామ బార్ అసోసియేషన్ సంఘ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్, మార్కపుడి డేవిడ్ నల్లనీ నరేంద్ర బాల భద్రారెడ్డి ఎంద్రాతి కాంతారావు ఎర్ర గొర్ల రామారావు పాల్గొన్నారు.

## పాత్రికేయ వృత్తి ఎంతో పవిత్రమైనది

### ఎంఎల్‌ఎ వసంత

**ప్రజాశక్తి - మైలవరం :** పాత్రికేయ వృత్తి ఎంతో పవిత్రమైందని ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు సమాజం కోసం పనిచేయాలని మీడియా సోదరుల సంక్షేమానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మైలవరం ఎంఎల్‌ఎ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక రిటైర్డ్ పెన్షనర్ల కార్యాలయంలో సోమవారం ఎపి ఎంపిఎ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ వర్గాల వారిని చైతన్య పరుస్తూ ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న పాత్రికేయులకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహన్రావు, సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా, ఏపీ ఎంపిఎ రాష్ట్ర నాయకులు వీర్ల శ్రీరామ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత

యాదవ్, రమణ, తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఎపి ఎంపిఎ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో సోమవారం ఆ సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షునిగా మైలవరానికి చెందిన బొడ్డు విజయ్ బాబు, ప్రధాన కార్యదర్శిగా కె.సూర్యప్రకాష్‌రావు, ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మరికొందరినీ ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని వీర్ల శ్రీరామ్ యాదవ్ అభినందించారు.

## వైసిపి నాయకుడిపై దాడిని ఖండిస్తున్నాం : టిడిపి

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** కొనకంచి క్రాస్ రోడ్డు వద్ద నవాబుపేట గ్రామానికి చెందిన వైసిపి నాయకుడిపై జరిగిన దాడి ఘటనను టిడిపి పూర్తిస్థాయిలో ఖండిస్తుందని ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. పట్టణంలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ ఆదివారం జరిగిన ఘటనపై సిఎం కార్యాలయం కూడా పూర్తిస్థాయిలో ఖండించడంతో పాటు ఎవరైతే దాడికి పాల్పడ్డారో వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేశారే తప్ప మీ వైసిపి ప్రభుత్వంలో లాగా దాడులు చేసిన వారిని తమ ముఖ్యమంత్రి ఏ రోజు సపోర్టు చేయలేదని తెలిపారు.



మాట్లాడుతున్న శ్రీరాం తాతయ్య

ఆయన ప్రభుత్వంలోనే చిట్యాల శీతారెడ్డి, మల్లారెడ్డి, ముళ్లపాడులో నరసరావు వంటి మర్డర్ కేసుల్లో మీ హస్తం లేదా అని అన్నారు. ఇప్పటికైనా ఈ ముగ్గురు కేసులతోపాటు నవాబుపేట గింజపల్లి వీరయ్య, బుచ్చయ్య చౌదరి కేసుల్ని సిబిఐకి ఇవ్వటానికి తాము సిద్ధంగా ఉన్నామని అదేవిధంగా వారు సిద్ధంగా ఉంటే రావాలని పిలుపునిచ్చారు.

## సోమేశ్వరరావుకు నివాళి

**జగ్గయ్యపేట :** పట్టణంలోని క్రిస్టియన్ పేటకు చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు పోతిపాక సోమేశ్వరరావు మృతి విషయం తెలుసుకున్న ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సోమవారం మృతుని నివాసంలో కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, తదితరులున్నారు.

## విలేజ్ క్లినిక్ ప్రారంభం

**జగ్గయ్యపేట:** మండలంలోని బలుసుపాడు గ్రామంలో గ్రామస్తులు బద్దుల వెంకట రామయ్య, వెలమాటి చంద్రమౌళి, గ్రామ టిడిపి సహకారంతో ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్‌ను సోమవారం శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఆరోగ్య సమస్యలకు, గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు వ్యాక్సిన్లు కొరకు ఉపయోగించుకొవాలని తెలిపారు. పేదలకు వైద్య సేవలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, సూపర్వైజర్ వెంకట్రావు, వనజాక్షి మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## రైతులు, కౌలు రైతులకు కార్డులు

**జగ్గయ్యపేట:** మండలంలోని బలుసుపాడులో గ్రామ పంచాయతీ ఆఫీస్‌లో గ్రామ నాయకులు, విఆర్ఒ షేక్ హుస్సేన్‌తో కలిసి గ్రామ రైతులకు, కౌలు రైతు కార్డులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## 7 నుంచి టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు ఉచిత శిక్షణ

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** పదోతరగతి ఫెయిలైన విద్యార్థులకు ఈనెల ఏడో తేదీ నుంచి తమ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులను ఏర్పాటుచేశామని వన్‌టౌన్ కొత్తపేటలోని ఎస్‌ఆర్‌ఎస్‌వి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఎస్‌ఆర్‌ఎస్‌వి బిఇడి కళాశాల) సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మాజేటి సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌కె దుర్గా సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థుల ఉపయోగార్థం ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తారని తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్,సోషల్ సబ్జెక్టుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామని వివరించారు. వన్‌టౌన్ కొత్తపేట లోని ఎస్‌ఆర్‌ఎస్‌వి బిఇడి కళాశాలలో జరిగే ఈ శిక్షణా తరగతులకు పదోతరగతిలో ఫెయిలైన విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఈనెల 7 నుంచి ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ కొనసాగుతాయని తెలిపారు. వివరాలకు 7995593859 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## బాలిక చదువు నిమిత్తం 'దీవెన' సాయం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** తల్లిదండ్రులు లేని కోటా సౌమ్య ఎనిమిదో తరగతి చదువుతూ సింగినగర్ గంగానమ్మ గుడి వద్ద తన నాయనమ్మ వద్ద ఉంటుంది. కూలి పనులు చేసుకుంటూ సౌమ్యని తన నాయనమ్మ సహాయం చదివిస్తోంది. అయితే చదువు నిమిత్తం బాలిక సౌమ్య నాయనమ్మ దీవెన ఫౌండేషన్ వారిని ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ వారి తరపున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని సింగ్‌నగర్ ఉమెన్ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ ప్రసన్న, గ్రూప్ సభ్యులు సింగ్ నగర్ కానిస్టేబుల్ చందు, హోంగార్డు ప్రసాద్ సోమవారం స్కూల్‌కి వెళ్లి సౌమ్యకు సహాయం అందించారు.



## ల్యాప్‌టాప్ అందజేత

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

ఆర్థిక ఇబ్బందులు పడుతున్న యువతను, విద్యార్థులను గుర్తించి బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్ చేసే సేవలు స్ఫూర్తిదాయకమని టిడిపి సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. జేఈఈ మెయిన్స్ లో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థి మోట్రు తన్మయ లహరికి సుమారు 70 వేల రూపాయలు ఖరీదు చేసే ల్యాప్‌టాప్‌ను బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్ సహకారంతో సోమవారం గోపీచంద్ ఆయన కార్యాలయంలో విద్యార్థి తన్మయ లహరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, పి.వి.ఫణికుమార్, లోగిశెట్టి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

**ప్రజాశక్తి-గన్నవరం**

స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని సోమవారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ఐజీ ఎం. ఉదయాభాస్కరరావు సందర్శించారు. కార్యాలయ రికార్డులను, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా కొత్త వెర్షన్లో రిజిస్ట్రేషన్లు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రయోజనాలు గురించి అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ల విధానంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించే పనిలో ఉన్నట్లు చెప్పారు. తొలుత సబ్ రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు మినహా ఇతర సిబ్బంది విధులకు అలస్యంగా రావడం పట్ల ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో పాటు సిబ్బంది సమయ పాలన పాటించడంతో పాటు ప్రజలకు సత్వర సేవలందించాలని ఆయన సూచించారు. సబ్ రిజిస్ట్రర్ కె. వెంకటేశ్వరరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## సాగునీరు కోరుతూ రాస్తారోకో



నిరసన తెలుపుతున్న రైతులు

**ప్రజాశక్తి-మొవ్వ:** మొవ్వ మండలం వేముల మాడ, మొవ్వపాలెం, తురకపాలెం, రుద్రవరం, చిలకలపూడి గ్రామాల పసిడి సాగు చేస్తున్న 360 ఎకరాల కు సాగునీరు సక్రమంగా అందడం లేదు. గత పది రోజుల క్రితం పడిన భారీ వర్షాల వలన 80 శాతం సాగైంది. ఇంకా 20 శాతం సాగునీరు లేక వరినాట్లు పడలేదు. సాగు చేసే వరి నారు మాడిపోయినది, సాగునీరు విడుదల చేయాలని ఆయా గ్రామాల పరిధిలోని రైతులు, కౌలు రైతులు సోమవారం మధ్యాహ్నం గ్రామ సచివాలయం ఎదురుగా ఆర్అండ్‌బి రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. రెండు గంటల వరకు రాస్తారోకో చేశారు. మండల ఎమ్మార్వో మస్తాన్, ఇరిగేషన్ ఎఇ గ్రామానికి చేరుకుని రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు. రెండు రోజుల్లో నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి పంచకర్ల రంగారావు, సహాయ కార్యదర్శి శీలం నారాయణ, బొల్లా రాంబాబు, జున్ను నాగేశ్వరావు, సుబ్రహ్మణ్యం వేముల శ్రీను, బొల్లా వెంకటేశ్వరమ్మ, వేముల శ్రీకష్ణ, సీతారామయ్య, జున్ను నాగరాజు, రమేష్, ఈడే ఆంజనేయులు, వడ్డీ శంకర్రావు, ఈడే వెంకటేశ్వరరావు, మురారి అమలేశ్వరరావు, తదితర రైతులు రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సమస్యలపై మహిళా పోలీసుల వినతి

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా):** సచివాలయ మహిళా పోలీసుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు జి.గోపీచంద్ సోమవారం మీ కోసం కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీకి వినతి పత్రం అందజేశారు. 2024 జూలై నుంచి రావలసి ఉన్న వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. రెండో నోటిఫికేషన్ ద్వారా నియాకమైన మహిళా పోలీస్‌లకు ప్రొబేషన్ కాలం పూర్తయి ఆరు నెలలు దాటినా కూడా మొదటి ఇంక్రిమెంట్ ఉత్తర్వులు ఇంకా ఇవ్వలేదు అని,అవి కూడా వెంటనే జారి చేయాలని, సంపాదిత సెలవులు సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేసి, అన్ని రకాల సెలవులను హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో అప్డేట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా జాయింట్ సెక్రెటరీ వేమూరి లావణ్య, కె.సుబ్బారావు, అనిల్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## అరుణాచలంకు బస్సు ఏర్పాటు

**ప్రజాశక్తి-ఉయ్యూరు:** శ్రావణమాసంలో అరుణాచలం దర్శించే యాత్రికుల కోసం ఉయ్యూరు డిపో నుంచి శనివారం రాత్రి 8 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ కెఎస్ఆర్కె ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాణిపాకం అద్దగిరి, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని 18న అరుణాచలంలో గిరిప్రదక్షణ, దర్శనం అనంతరం కాంచీపురం, తిరుత్తినిలో కొలువైన కుమారస్వామి దర్శనం, శ్రీకాళహస్తిలో వాయులింగేశ్వరస్వామి దర్శనం తరువాత ఉయ్యూరు చేరుతుందని తెలిపారు. ఒక్కొక్కరికి ఛార్జి రూ.3 వేలని, ఇతర వివరాలకు 7382893468, 8919366868 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## పంట నమోదు ప్రారంభం

**ప్రజాశక్తి-పమిడిముక్కల:** రైతులు వచ్చే నెల 15 లోపు ఈ పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుర్రాలంక కోగంటి శ్రీరామ్ పొలంలో పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమం వలన ప్రధానమంత్రి పర్సనల్ యోజన పథకం, అన్నదాత సుఖీభవ పథకం లాంటి పథకాలు బ్యాంక్ అకౌంట్‌లో పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెల్లాకుల సుజని, రైతులు పాల్గొన్నారు.


## ఆటోనగర్ విస్తరణపై ఎంఎల్‌సి లక్ష్మణరావుకు వినతి

**ప్రజాశక్తి-గుడివాడ:** ది కష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆటోనగర్ కమిటీ గుడివాడ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో ఉన్న సమస్యలపై, ఆటోనగర్ విస్తరణ కోసం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ అమీద్ అలియాస్ అమీర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, నాయకులు అబ్దుల్ రషీద్ బేగ్, బొబ్బరపల్లి ఆంజనేయులు, రెడ్డి నాగరాజు, ఎస్.కె మొహిద్దిన్ భాష, మహదేవ ఆదినారాయణ, అన్నమనేడి




వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏపీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు కూడా వినతిపత్రం అందజేశారు.

## బిల్లు ఒకరిది... వసూళ్లు మరొకరది



**ప్రజాశక్తి-గన్నవరం:** గన్నవరం పట్టణంలోని రాయనగర్ స్టేట్ బ్యాంక్ సమీపంలో ఉన్న రక్షిత బోర్‌వెల్‌కు విద్యుత్ సరఫరాను అధికారులు నిలుపుదల చేశారు. ఐదు లక్షల రూపాయల విద్యుత్ బిల్లు పెండింగ్ ఉండడంతో అధికారులు విద్యుత్ బోర్డులో ఫీజులు పీకేశారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాయ నగర్ సొసైటీ పెద్దల ఆదేశం మేరకు సొసైటీ వాటర్‌మెన్ విద్యుత్ జంపర్లకు తీగలు వేసి బోర్వెల్ ఆడించి నీటి సరఫరా చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ బోర్వెల్ పంచాయతీకి చెందినది. కరెంట్ బిల్ గత 15 సంవత్సరాలుగా పంచాయతీనే చెల్లిస్తుంది. ఇప్పటివరకు రూ.13.60 లక్షలు బిల్లుగా చెల్లించారు. ఇంకో ఐదు లక్షలు బకాయి పడింది. విచిత్రం ఏమంటే బోర్వెల్‌కు కరెంట్ బిల్లు పంచాయతీ చెల్లిస్తుంటే వాటర్ బిల్లు మాత్రం సొసైటీ వారు వసూలు చేసుకుంటున్నారని చెప్తున్నారు. ఒక్కో ఇంటి దగ్గర నుంచి నెలకు 100 రూపాయలు వాటర్ ట్యాక్స్‌గా వసూలు చేస్తున్నారని స్థానికులు చెప్పారు. ఈ బోర్వెల్ మెయింటినెన్స్ మాత్రం పంచాయతీనే చూస్తుంది. సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్నట్లుగా ఇక్కడ తంతు ఉందని పంచాయతీ వార్డు సభ్యులు విమర్శిస్తున్నారు. లక్షల రూపాయలు సొసైటీ వారి ఖాతాకు వెళుతుండగా ఖర్చు మాత్రం పంచాయతీకి మిగులుతుందని అంటున్నారు. ఇదే మీ విడ్డురమో అర్థం కావడం లేదని వార్డు సభ్యులు ముక్కున వేలేసుకుంటున్నారు. గత 15 సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతున్న పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. రాయ నగర్ లో ఈ బోర్వెల్ నుంచి నీరు సరఫరా చేస్తున్న కుటుంబాలన్నీ సంపన్నులే కావడం విశేషం. వారంతా నీటి పన్ను చెల్లిస్తున్న పంచాయితీకి మాత్రం ఒక్క రూపాయి జమ కావడం లేదు అని ఈవో అనిల్ తెలిపారు. ఈ విషయంపై ఫిర్యాదు రావడంతో బోర్‌వెల్ విద్యుత్ సరఫరా నిలిపివేయమని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. పెద్దలే ఈ విధంగా చేయడం సరి కాదని ఆయన అన్నారు. ఇది బిల్లు 5 లక్షల దాకా పెండింగ్లో ఉందని, దానిని చెల్లించే వరకు సదరు బోర్వెల్ కు మెయింటినెన్స్ కూడా నిలుపుదల చేస్తామని చెప్పారు. పెద్దలు స్పందించని ఎడల బోర్వెల్ పవర్ కట్ చేయిస్తామన్నారు.

పంచాయితీ బోర్వెల్ నుంచి ప్రజలకు నీటి సరఫరా చేస్తే.. వాటర్ టాక్స్ పంచాయతీకి రావాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో అధికారులు చేసిన పని వల్ల పంచాయతీ లక్షల రూపాయలు ఆదాయం కోల్పోయిందన్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. 2011 నుండి 2024 వరకు 13.47 లక్షలు కరెంట్ బిల్లు పంచాయతీ నుండి చెల్లించారు. ఇంకా ఐదు లక్షలు కట్టాలి. సొసైటీకి మాత్రం ఈ 15 సంవత్సరాలలో 20 లక్షల పైగా టాక్స్ వచ్చిందని పంచాయతీ అధికారులే చెప్తున్నారు. రాయ నగర్ సొసైటీ వారు 160 నుంచి 200 మంది వరకు నెలవారీగా వసూలు చేస్తున్న డబ్బులు ఏమైనట్లు? ఎవరి జేబులోకి వెళ్లాయి అనేది తేల్చాలని, కొంతమంది డిపిఓ కు ఫిర్యాదు చేశారని తెలిసింది. దీనిపై పంచాయతీ ఉన్నతాధికారులకు రిపోర్టు వెళ్లింది. ఈ విషయమై సర్పంచ్ నిడమర్తి సౌజన్యను వివరణ అడగ్గా.. పంచాయతీకి ఫిర్యాదు వచ్చిన మాట నిజమే అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించామన్నారు.

## పెడన తహశీల్దార్‌గా రెహమాన్

**ప్రజాశక్తి-పెడన:** సాధారణ బదిలీల భాగంగా పెడన తహశీల్దార్‌గా అబ్దుల్ రెహమాన్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా గుడ్లవల్లేరులో పనిచేస్తున్న రెహమాన్ డిప్యూటేషన్‌పై ఏలూరు జిల్లాలో విధులు నిర్వహించారు. అనంతరం సాధారణ బదిలీలపై పెడనకు వచ్చారు. గుడ్లవల్లేరుకు



ముందు గుడివాడ, నందివాడ మండలంలో తాసిల్దారిగా పనిచేశారు. రెహమాన్ ను మండల విఆర్వోల సంఘం అధ్యక్షుడు పరసా గోవిందరాజులు, ఇంచార్జ్ ఎమ్మార్వో కాగిత పూర్ణచంద్రరావు, ఆర్ఐ మణికుమార్ తో పాటు వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయాల సిబ్బంది చేసి పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలియజేశారు.

## తహశీల్దార్ల బాధ్యతలు స్వీకరణ

**ప్రజాశక్తి-కంకిపాడు**





కంకిపాడు, పెనమలూరు మండలాల తహశీల్దార్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కంకిపాడు మండలానికి భవన్నారాయణ, పెనమలూరు మండలానికి కలగర గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు వారికి అభినందనలు తెలిపారు.

## ఎంఎల్ఎకు చిత్రపటం బహూకరణ

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు జనసేన నాయకుడు గాజుల పోతురాజు ఓ అపురూపమైన చిత్రపటాన్ని బహుకరించారు. ఆదివారం మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు జయంతిని పురస్కరించుకొని గాంధీ క్షేత్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు



వల్లభనేని బాలశౌరి చేతుల మీదుగా మండలి వంశంలో మూడు తరాల ముఖ్య నేతలతో కలిగిన చిత్రపటాన్ని అందజేశారు.

## ఉయ్యూరు తహశీల్దార్‌గా సురేష్‌కుమార్

**ప్రజాశక్తి-ఉయ్యూరు:** ఉయ్యూరు మండల తహశీల్దార్‌గా ఎం.సురేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్డీవో డి.రాజును కలిసి పుష్పగుచ్చం అందజేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు, విఆర్వోలతో



సమావేశం నిర్వహించారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి సత్వరం సేవలందించాలని సూచించారు.

## 8న పాఠశాల కమిటీ ఎన్నికలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** ఈ నెల 8వ తేదీన జరిగే స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో డి కష్ణవేణి కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎలాంటి వాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల నిర్వహణ సక్రమంగా జరగాలని సూచించారు. విద్యార్థులు సక్రమంగా విద్యను అభ్యసించేందుకు, స్కూల్ అభివద్ధికి కషి చేసే స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల వల్ల చాలా ఉపయోగం ఉంటాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, ఎంఈఓ 1, 2 జగన్మోహనరావు, జి.గోపాలరావు పాల్గొన్నారు.

## విద్యుత్ సదుపాయం

**ప్రజాశక్తి-అవనిగడ్డ:** మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామపంచాయతీ శివారు వల్లందపాలెం చెరువుగట్టు వద్ద నివాసం ఉంటున్న ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన తుమ్ము కోటేష్ కుటుంబానికి రామచంద్రాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు ఆర్థిక సహకారంతో విద్యుత్ సదుపాయం కల్పించారు. ఈ మేరకు సోమవారం తన సొంత ఖర్చులతో విద్యుత్ మీటరు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాకా రమేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం

## ఎల్‌బిఆర్‌సిఇలో ఫ్రెషర్స్ డే వేడుకలు

**ప్రజాశక్తి - మైలవరం :** స్థానిక లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ లక్కిరెడ్డి ప్రసాద్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి క్లాసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలవరం, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు కోసం అన్ని రకాల హంగులతో విద్యార్థులకు విద్యను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా లక్ రెడ్డి ప్రసాద్ రెడ్డి మాతృమూర్తి లక్కిరెడ్డి సరస్వతి పేరున కళాశాలలో ప్రతి విభాగంలో మొదటి స్థానంలో ఉత్తీర్ణులైన 62 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ అప్పారావు, వివిధ విభాగాధిపతులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణహిత నిర్మాణాలపై అవగాహన


మాట్లాడుతునన శ్రీనివాస్

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** గృహ నిర్మాణ రంగంలో అగ్ర గామి ఐఐఎఫ్‌ఎల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ నగరంలో ప్రాంతీయ వర్క్ షాపును నిర్వహించి నట్లు సంస్థ సేల్స్ హెడ్ శ్రీనివాస్ రేకపల్లి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ( ఐఎఫ్‌సి ) సహకారంతో ఈ వర్క్‌షాపును నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ హౌసింగ్ పథకాల లబ్ధిదారులలో పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పర్యావరణ అనుకూలమైన భవనాలను నిర్మిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఉంఆయన్నారు. శక్తిని ఆదా చేసే ఫ్యాన్లు, నీటిని ఆదా చేసే కుళాయిలు, షవర్ హెడ్‌లు, సోలార్ వాటర్ హీటర్లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్‌ల వినియోగం వంటి పలు అంశాలను గురించి వివరించారు. ఈకార్యక్రమంలో పలువురు కంపెనీ ప్రతినిధిలు పాల్గొన్నారు.

## కమలాకర్‌కు పురస్కారం

**ప్రజాశక్తి - విస్సన్నపేట :**

అరుదైన ఓరుగల్లు లెజెండ్ పురస్కారాన్ని విస్సన్నపేట వాసి మేడా కమలాకర్ అందుకున్నారు. తెలంగాణ దేవాదాయ పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, వివిధ పార్టీల నాయకుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని సోమవారం అందుకున్నారు. వరంగల్లు కన్నతల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొండమీది రాజన్ బాబు ఆధ్వర్యంలో ఓరుగల్లు లెజెండ్ పురస్కారాలు ఏర్పాటుచేశారు. వాసి మేడా కమలాకర్ ఆయన హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులుగా ఐదు సంవత్సరాల నుండి మానవ హక్కుల ఉల్లంఘనపై అనేక కార్యక్రమాలం చేసిన నేపథ్యంలో ఈ పురస్కారానికి అర్హత సాధించినట్లు రాజన్ బాబు తెలిపారు. తెలుగు రెండు రాష్ట్రాల నుండి ముగ్గురిని ఎంపిక చేయగా అందులో మేడా కమలాకర్ ఈ పురస్కారానికి ఎంపిక అయ్యారని తెలిపారు. ఆయనకు ఘన సత్కారంతో పాటు ప్రశంసాపత్రం, పురస్కారం అందజేసినట్లు తెలిపారు.



# చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి

## తొలగింపులు నిలుపుదల చేయకుంటే ఉద్యమం ఉధృతం : సిఐటియు


మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమా మహేశ్వరరావు

**ప్రజాశక్తి - విజయవాడ :** చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు నిలుపుదల చేసి, బలవంతంగా తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని లేనట్లయితే చిరుద్యోగుల ధర్నాలతో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చౌక్‌లు దద్దరిల్లిపోతాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్‌టిఆర్ జిల్లాలో చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు నిలుపుదల చేయాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా జరిగింది. ఐకెపి విఒఎలు, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, స్కూల్స్‌లో పని చేసే శానిటేషన్ కార్మికులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, ఆశా తదితర రంగాలకు చెందిన చిరుద్యోగ, కార్మికులు జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చి ధర్నాను విజయవంతం చేశారు. కార్యక్రమానికి సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు కె.దుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 700 మంది విఒఎలలో 150 మందిని ఇప్పటికే తొలగించారని, మరో 150ని తొలగించడానికి సిద్ధం చేస్తున్నారని, మధ్యాహ్నం భోజనం పథకం కింద పని చేస్తున్న వారిలో 100 మందిని తొలగించారని, గొల్లపూడిలో పది మంది, ఊటుకూరులో ఐదుగురిని తొలగించారని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ...ఎన్‌టిఆర్ జిల్లాలో చిరుద్యోగుల పట్ల టిడిపి దానిమిత్రపక్షాల కూటమి నాయకత్వం అత్యంత దారుణంగా, క్రూరంగా వ్యవహరిస్తూ, ఎక్కడికక్కడ చిరుద్యోగులను తొలగిస్తూ, తమ అనుయాయులను చేర్చుకుంటుంటే... సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్ సైతం చోద్యం చూస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, మిడ్డే మీల్స్ వర్కర్స్‌యూనియన్ జిల్లా అధ్యక్షులు సుశీల, విఒఎల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ చాంద్ బేగం, ఎ ఉమాదేవి, ఆశ వర్కర్స్‌యూనియన్ జిల్లా నాయకులు నాగమణి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ ఇవి నారాయణ, ఎంవి సుధాకర్, ఎం శ్రీనివాస్, కె గోపాల్, నాయకులు ఎం సోమేశ్వర రావు, ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ నాయకులు ముత్తయ్య, సిఐటియు రాష్ట్ర కోశాధికారి కెఆర్‌కె మూర్తి, నాయకులు నర్సింహులు, ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రదాన కార్యదర్శి ఎం సీతా రాములు, నగర నాయ కులు, హాకర్స్ యూనియన్ నగర కార్యదర్శి మురళి, నాయకులు ఎంన్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

**పిచ్చుకపై బ్రహ్మాస్త్రమా ! : ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి**



గ్రామాల్లో/ పట్టణాల్లోని చిరుద్యోగుల పట్ల నూతన ప్రభుత్వంలో రాజకీ వేధింపులు తప్పడం లేదు. కొన్నిగ్రామాల్లో ఆయా శాఖల్లో పని చేస్తున్న చిరుద్యోగులను ఎటువంటి విచారణ లేకుండా, రాజకీయ కారణాల పేరుతో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తున్నారు. ప్రభుత్వ తీరు పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా ఉంది.

**రాజకీయ కక్షతో తొలగించారు : షేక్ చాంద్‌బేగం, విఒఎల సంఘం జిల్లా అధ్యక్షులు**



ఎటువంటి కారణం చూపకుండానే... రాజకీయ కక్షతో తనను తొలగించారు. వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో విఒఎగా పని చేస్తున్నాను. తొలగిస్తున్నట్లు ఎటువంటి ముందస్తు సమాచారం లేదు.

**ఉద్యోగ బద్రత లేదు : తోటపల్లి దానయ్య, మిడ్డేమీల్స్ కార్మికుడు**



ప్రస్తుత ప్రభుత్వంలో కూడా ఉద్యోగ భద్రత లేదు. తనను ఎటువంటి కారణం చూపకుండానే తొలగించారు. కొండూరు మండలంలో తాను మిడ్డేమీల్స్ కార్మికుడిగా కొన్నేళ్ల నుంచి పని చేస్తున్నా... నిత్యావసర సరుకుల ధరలు గిటుబాటు కాకపోయినా..అప్పోసప్పోచేసైనా పిల్లలకు వడ్డిచ్చేవారం. బిల్లులు రాక ఇబ్బందులు పడేవారం... కష్టపడినా తమను తొలగించారు.

**రాజకీయ సంబంధాలు లేకపోయినా తొలగించారు : డి.సరస్వతి, మిడ్డే మీల్స్ కార్మికురాలు, ఐతవరం గ్రామం**



తనకు ఎటువంటి రాజకీయ సంబంధాలు లేకపోయినా ప్రతిపక్షపార్టీ ముద్ర వేసి...నూతన ప్రభుత్వంలోని రాజకీయ నాయకుల వత్తిడి మేరకు అధికారులు తొలగించారు. ఈ రకంగా జిల్లాలో అనేక మందిని మిడ్డేమీల్స్ కార్మికులను తొలగించారు.

**కక్ష గట్టి తొలగిస్తున్నారు : టి.విజయలక్ష్మీ, విఒఎ, రామచంద్రాపురం, ఏ కొండూరు మండలం**



విఒఎలను కక్షగట్టి తొలగిస్తున్నారు. గంపలగూడెం మండలంలో 17 మంది, వీరుల పాడు , కంచికచర్ల, నందిగామ, చందర్లపాడు మండలాల పరిధిలోనే 32 మంది విఒఎలను తొలగించారు. రాజకీయ నాయకులకు ఎపిఎం, సిసిలు వత్తాసు పలుకుతూ అకారణంగా తొలగిస్తున్నారు.



అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాశీనాథ్, తదితరులు

# తవ్వారు... వదిలేశారు

**దెబ్బతిన్న రోడ్లను పునర్నిర్మించాలని సిపిఎం వినతి**

**ప్రజాశక్తి - విజయవాడ :** స్థానిక కృష్ణలంకలో తవ్వి వదిలేసిన రోడ్లు పునర్నిర్మాణం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. సిపిఎం 21వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ ... ఎ.మహేష్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ... కృష్ణలంకలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారయిందన్నారు. ప్రతి రోడ్డును తవ్వి వదిలేశారని, కనీసంగా మరమ్మతు పనులు కూడా చేయలేదన్నారు. స్థానిక కార్పొరేటర్, ఎంఎల్‌ఎ ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు గగ్గోలు పెడుతున్నా, అధికారులకు, ప్రజాప్రతినిధులకు చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. ఈ ప్రాంతంలో రెండు పాఠశాలలున్నాయని, సుమారు 2వేల మంది పిల్లలున్నారని అన్నారు. విద్యార్థులను ప్రతిరోజు తీసుకువచ్చి, తీసుకువెళ్ళే వారి తల్లితండ్రులతో రహదారులు రద్దీగా ఉంటాయన్నారు. ఎక్కడ ప్రమాదం జరుగుతుందో అని ప్రాణం అరచేతుల్లో పెట్టుకుని పిల్లలను తీసుకువచ్చే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే డివిజన్‌లు మూడు ప్రమాదాలు జరిగి కాళ్ళు, చేతులు విరిగాయని గుర్తు చేశారు. పాత పోలీస్ స్టేషన్ రోడ్డు మొదలుకుని, హరిజన సేవాసంఘం వీధి, పీతా బసవయ్య వీధి, కల్పన ప్రింట్స్ రోడ్డు, హైస్కూల్ రోడ్డు, లాల్ బహుదూర్ శాస్త్రీ రోడ్డు, బీచ్ రోడ్డు ఇలా ఏ.రోడ్డు వదలకుండా మొత్తం తవ్వి వదిలిశారని అన్నారు. కల్పన ప్రింట్స్ రోడ్డులో ఇంటికి ఒక మ్యాన్‌హోల్ పేరుతో రోడ్డంతా డ్రెయినేజీ మ్యాన్‌హోల్స్‌తో నిండిపోయిందన్నారు. డ్రైనేజీల ఎత్తు ఎక్కువగా, రోడ్డు పల్లంగా ఉండటం వలన నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించామని, సోమవారం గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ మహేష్ వినతిపత్రం రూపంలో ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పుప్పాల కృష్ణ, నగర కమిటీ సభ్యులు కోరాడ రమణ, స్థానిక నాయకులు కె.శివాజీ, కోటి, ఫిరోజ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాలలోని భౌతికశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసర్చ్ (అణు శక్తి విభాగం) సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా 24 నమూనాలతో కూడిన వైజ్ఞానిక ప్రత్యక్ష ప్రదర్శన సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో సిద్ధార్థ అకాడెమీ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ డా.సి.నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎన్.లలిత్ ప్రసాద్, కృష్ణ విశ్వవిద్యాలయ రెక్టార్, సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థి ప్రొ. ఎం.బసవేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వి.బాబురావు, డీన్ రాజేష్ సి.జంపాల, భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాస కృష్ణ, అధ్యాపకుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ప్రతిష్టాత్మకమైన ప్రదర్శనను పి.బి సిద్ధార్థ కళాశాలలో నిర్వహిస్తున్నందుకు ఐ.పి.ఆర్ (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసర్చ్) బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్లాస్మా అంటే ఏమిటి? దాని వల్ల ప్రయోజనాల ఏమిటి? ప్లాస్మా వల్ల భవిష్యత్తులో రాబోయే మార్పులు ఇలా అనేక అంశాలు గురించి విద్యార్థులు ప్రత్యేక్షంగా వీక్షించి తెలుసుకున్నారు. మొదటి రోజు ఉదయం 9:30 నుండి సాయంత్రం 4:30 వరకు జరిగిన ఈ ప్రదర్శనకు వివిధ పాఠశాలలు, కళాశాలలు నుండి సుమారుగా 1000 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఆసక్తిగా తిలకించారు. సిద్ధార్థ కళాశాల డిగ్రీ, పీజీ విద్యార్థులు నమూనాలను వివరించి అభినందనలు అందుకున్నారు.

## గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ టూ వీలర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :**

గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ నుండి కొత్త ఎబ్లూ ఫియో ఎక్స్ ఈవీ టూవీలర్‌ను నగర మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు గోదావరి మోటార్స్ సీఈవో హైదర్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మొట్ట మొదటిసారిగా ఫ్యామిలీ ఇ - స్కూటర్ ఎబ్లూ ఫియో ఎక్స్ కొత్త వేరియంట్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈవీ ద్విచక్ర వాహన విభాగంలో కంపెనీకి ఇది రెండో ఉత్పత్తి అన్నారు. ఎబ్లూ ఫియో ఎక్స్ గ్లోబల్ మొబిలిటీ ఎక్స్‌పో 2004లో ఆవిష్కరించినట్లు తెలిపారు. ఇ- స్కూటర్ 2.36 కె.డబ్ల్యూ బ్యాటరీని కలిగి ఉంటుందని, 110 కిలోమీటర్ల పరిధిని అందిస్తుందన్నారు. ఎబ్లూ ఫియో ఎక్స్ ఎక్స్ షోరూమ్ ధర రూ.99,999లుగా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.